# జనశక్తి

విప్లవ కమ్యూనిస్టుల పక్ష పత్రిక

www.janasakthionline.com

సంపుటి : 47 సంచిక : 14 విజయవాడ 20-11-2014 పేజీలు : 8 వెల : రు 5.00



లోపలి పేజీల్లో...

- ప్రధాని జపాను పర్యటన : మనదేశ సహజవనరుల దోపిడీకి స్వాగతం
- 'ఎబోలా వ్యాధి ప్రబలటానికి కారణం అమెరికానే' – డా|| సిరిల్ బ్రాడరిక్
- మహిళల సాధికారిత, సమానత్వాలు : సామ్రాజ్యవాద ప్రపంచీకరణలో ఎండమావులు
- విస్తరించని నూనెగింజల సాగు : దిగుమతులకే ప్రాధాన్యమిచ్చే పాలకులు
- ప్రపంచవ్యాపితంగా కార్మికుల ఆందోళనలు
- చరిత్రను మథిస్తున్న కార్మికుడు – కవిత – బెర్టోల్డ్ బ్రెక్ట్


## రాజధాని నిర్మాణం - ఆకాశానికి నిచ్చెనలు

## నలిగిపోయేది ప్రజలు-లాభపడేది దోపిడీ వర్గాలు

**రాష్ట్రవిభజన** జరిగిన నాటినుండీ క్రొత్త రాజధాని నిర్మాణాన్ని మౌలిక సమస్యలనుండి ప్రజల దృష్టిమళ్లించే సాధనంగా టిడిపి ప్రభుత్వం వాడుతున్నది. ఒక ప్రక్కన రాష్ట్ర ఆర్థికపరిస్థితి సంకటంలో వుందంటూనే, ఆకాశ హర్మ్యాలతో రాజధాని నిర్మాణం చేస్తానని ప్రకటనలు గుప్పించింది. రైతుల రుణమాఫీ వాగ్దానం అమలును ఎటూ తేల్చకుండా, కొత్త అప్పులు పుట్టకుండా చేసి, రాజధాని నిర్మాణ ప్రాంతాన్ని ప్రకటించి, రియల్ ఎస్టేటు దందాకు తెరలేపారు. భూసేకరణకు తగిన నిధులు లేవంటూ భూసమీకరణ పేరిట, రైతుల భూములకు డబ్బు చెల్లించకుండా, పదేళ్ల తర్వాత కోట్లు వస్తాయంటూ ఆశలు కల్పిస్తున్నారు.

ఈ వంచన బ్రిటీషు కాలంనుండీ సాగుతున్నది. ప్రజాప్రయోజనం సాకుచెప్పి వలస పాలకులు ప్రజలనుండి భూములు లాగివేసుకున్నారు. బ్రిటీషువారు వదిలిన చెప్పుల్లో కాళ్లు దూర్చిన నేటి పాలకులు అదే విధానాన్ని అనుసరించి ప్రజాప్రయోజనం సాకు చెప్పి ప్రజల భూములు లాగివేసుకున్నారు. నూతన ఆర్థిక విధానాలతో మరింత వంచనాత్మక విధానాన్ని చేపట్టారు. సెజ్‌లు, కారిడార్లు పేరిట భూసేకరణను ప్రకటిస్తారు. దానిని బూచిగా చూపి ప్రజలనుండి భూమిని లాగివేసుకోవటం సాగించారు. దీన్ని కప్పిపుచ్చేందుకు మెరుగైన నష్టపరిహారం, పునరావాస కల్పన అంటూ ఊదరగొట్టి, ఆ మేరకు చట్టాన్ని సవరించారు.

ఇప్పుడు వంచనకు మరింతగా పదునుపెట్టారు. నిధులు లేవంటూ, జరగబోయే అభివృద్ధిలో భూమి కోల్పోయిన వారికి కూడా వాటా యిస్తామంటూ భూసమీకరణను ముందుకు తెచ్చారు. దీనికి సంబంధించి ఎలాంటి ప్లాను రూపొందించకుండా వదలిపెట్టి, ధనాఢ్య వర్గాల భూముల ఆక్రమణకు తెరలేపారు. పదేళ్ల తర్వాత జరగబోయేదేమిటో తెలియక ఆందోళనలో వున్న వారినుండి భూములు కొనివేసుకునే అవకాశాన్ని కల్పించారు. పద్ధతి ఏదైనా ఫలితం ఒక్కటే. భూమిపై ఆధారపడి జీవిస్తున్న ప్రజలకు భూమిలేకుండా చేసి తరిమివేయటం; భూమిని ధనాఢ్య వర్గాలకు కట్టబెట్టడం!

భూమి నుండి తొలగించిన వారికి మరొక ఉపాధి మార్గం చూపిస్తారని భావిస్తే అది అడియాసేనని నాగార్జునసాగర్ నిర్మాణం నాటి నుండి నేటి కాకినాడ సెజ్, థర్మల్ ప్రాజెక్టుల నిర్మాణాల అనుభవం కరాఖండిగా తెల్పుతున్నది. యువతను గత 66 ఏళ్లుగా నిరుద్యోగ బారినపడవేసిన పాలకులు యిప్పుడు నిర్వాసితులకు ఉపాధి కల్పిస్తారని ఆశించలేము. ఈ దివాళాకోరుతనాన్ని కప్పిపుచ్చుకునేందుకు జిల్లాకొక ఓడరేవు, విమానాశ్రయం నిర్మిస్తానంటూ, అందువల్ల ఉపాధి దొరుకుతుందంటూ ఆశల పందిళ్లు వేస్తున్నారు. నికృష్ట దారిద్ర్యంలోవున్న 70శాతం ప్రజలు వాటివైపు కన్నెత్తి కూడా చూడలేరు. ఒకప్రక్క ఉపాధి పొందగల నైపుణ్యాలు యువతకు కొరవడ్డాయంటున్న పాలకులే, ఈ నిర్మాణాలతో ఉపాధి దొరుకుతుందని భుజాలు చరచుకుంటున్నారు. సాగునైపుణ్యం వున్న నిర్వాసితులకు దక్కేది కూలిపనే. భూమిపై జీవనాధారం సాగిస్తున్న నిర్వాసిత వర్గాలన్నీ కడుపుచేత పట్టుకుని వలసలు పోవలసిందే.

ఈ మోసాన్నంతా డబ్బు మాయాజాలంతో కప్పిపుచ్చుతున్నారు. ఎకరా కోటికి పైగా పలికిందంటూ దానిని చక్కగా మదుపుచేసుకున్న వారిని ఆదర్శవ్యక్తులుగా ప్రచారం సాగిస్తున్నారు. ఇన్నివేల కోట్ల రూపాయల దొంగ డబ్బు(బ్లాక్‌మనీ) రంగంలోకి దిగింతర్వాత అన్నింటి ధరలు అనూహ్యంగా పెరుగుతాయి. ఉపాధి కల్పించుకునే మార్గంలేక, దుబారా ఖర్చులు జరిగి కన్ను తెరిచేలోపలే డబ్బు చేయిజారిపోయిన అనుభవాలు హైద్రాబాదు ఔటరు రింగురోడ్డు నిర్మాణ సమయంలో కావల్సినన్ని వున్నాయి. చివరికి లబ్ధిపొందింది ధనాఢ్యవర్గాలే. ఈలోపుగా సాంఘిక, కుటుంబ, మానవ సంబంధాలు విచ్ఛిన్నమవుతాయి. ఇప్పుడే అమ్మటమా, తర్వాత అమ్మటమా లేక భూసమీకరణకు యివ్వటమా అన్న సంశయంతో కుటుంబాలలో కలహాలూ, గ్రామాలలో, గ్రామాల మధ్య కలహాలూ రేపెట్టి పాలకులు చిత్రం చూస్తూ గడుపుతున్నారు. ప్రజలమధ్య తంపులుపెట్టి పిట్టలపోరు పిల్లితీర్చినట్లు భూములు తన్నుకుపోయేందుకు కాచుకుకూర్చున్నారు.

ఇది భూమి, జీవనోపాధి కోల్పోతున్న ఆప్రాంత ప్రజల సమస్య మాత్రమేకాదు. ప్రజలందరి సమస్య. ఒక కేంద్రంనుండి పాలన సాగించేందుకు రాష్ట్ర ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణానికి 500 ఎకరాలు ఎలా లెక్కవేసినా సరిపోతాయి. ప్రజలు తమ సమస్యలను ముందుకు తెచ్చిన ప్రతిసందర్భంలోనూ రాష్ట్రం ఆర్థిక యిబ్బందుల్లో వుందంటూ చెప్పే పాలకులు, పొదుపుగా, ఒద్దికగా ఆర్థిక పరిస్థితికి తగినవిధంగా రాజధాని నిర్మాణానికి పూనుకునే బదులుగా ఆకాశానికి నిచ్చెనలెందుకు వేస్తున్నారు? పెదవి కదిపితే సింగపూరు జపమెందుకు చేస్తున్నట్లు?

సింగపూర్ ఒక్కరోజులో పెరగలేదు. 70 ఏళ్ల చరిత్ర వుంది. సామ్రాజ్యవాద దేశాల ద్రవ్య జూదరులందరూ అక్కడ చేరారు. కళ్లు మిరుమిట్లు గొలిపే భవనాలు, విశాలమైన రోడ్లు, జూదగృహాలు, వ్యభిచార కొంపలతో నిండిన సింగపూరు నిర్మాణంలో రాళ్లెత్తిన కూలీలెవ్వరు? బంగ్లాదేశీయులు, పాకిస్తానీయులు, భారతీయులు. ఈ దేశాల నుండి వెళ్లిన ఈ శ్రామికులు నిర్మాణంతోపాటు, రోడ్లు తుడిచే పనులవంటివి ఈనాటికీ చేస్తున్నారు. వీరు నగరంలో కనిపించకుండా, వచ్చి పనులు చేసిపోవాలి. సమ్మెచేస్తే పోలీసు కాల్పులే! రాష్ట్ర వనరులన్నింటినీ దోచుకునేందుకు వచ్చే సామ్రాజ్యవాదులకు సకల సౌకర్యాలతో రాచమర్యాదలు జరిపేందుకు తగిన రాజధానిని నిర్మించేందుకు పూనుకుంటున్నానని సింగపూర్ జపంతో చంద్రబాబునాయుడు ప్రకటించుకుంటున్నాడు. ఈ రాచమర్యాదలు చేసే అవకాశాలను (స్టార్ హోటళ్లు తదితరాలు) చూసి గుటకలువేస్తున్న ధనాఢ్య వర్గాలు చంద్రబాబుకు బ్రహ్మరథం పట్టి, ప్రజల భూములు పొందేందుకు పూనుకున్నాయి. వీరందరికి తగిన వాటాలు పంపకాలు చేసే పనిలో ఎన్నికల ముందునుండి (రాజధాని నిర్మాణ కాంట్రాక్టులు, భూపందారాలు) చంద్రబాబునాయుడు తలమునకలుగా వున్నాడు. ఈ పంపకాలతో ఎక్కువ ముఠాలను సంతృప్తిపరచటమే, టిడిపి గెలుపువెనుకనున్న ముఖ్యకారణాలలో ఒకటి.

ఇంతకీ ఈ సొమ్మంతా ఎవరిది? 500 ఎకరాలు సరిపోయే రాజధానికి 30వేల ఎకరాల మొదటి దశ ఖర్చు భారతమంతా ఎవరు మోయాలి? ఠక్కున సమాధానం ఇస్తారు. కేంద్రమే భరిస్తుంది. ఎంత ఎక్కువ రాబట్టుకుందామా, ఎంతత్వరగా పంపకాలు చేద్దామా అన్న ఆతృతే తప్ప ప్రజాసంక్షేమమన్నది ఏమాత్రం పట్టలేదు. రాజధాని నిర్మాణానికి తరలిరమ్మని సింగపూర్‌లోని బడాపెట్టుబడిదారులను ఆహ్వానించివచ్చాడు. **(తరువాయి 2వ పేజీలో)**

## 'శ్రమయేవ జయతే'

## కార్మికవర్గాన్ని వంచిస్తున్న ప్రధాని మోడి

**1947** ఆగస్టు తర్వాత పాలన సాగిస్తున్న వర్గాలు ఆడంబర నినాదాలు, ఆకర్షణీయ పథకాలతో ప్రజలను, ప్రత్యేకించి కార్మికులను వంచించే కళలో ఆరితేరారు. ఈ వంచనా కళలో ప్రధాని మోడీ అందరినీ మించిపోయాడు.

అక్టోబరు 16న పండిట్‌దీనదయాళ్ శ్రమయేవ జయతే కార్యక్రమం పేరిట ఇన్‌స్పెక్టర్ల రాజ్యాన్ని అంతమొందిస్తాననీ, కార్మిక చట్టాలను సవరిస్తాననీ మోడీ ఆర్భాటంగా ప్రకటించాడు. కార్మికుల కోసమంటూ శ్రమ సువిధాపోర్టల్ అన్న వెబ్‌సైట్‌ను ఆవిష్కరించాడు. రాష్ట్రీయ స్వాస్థ్యబీమా యోజనా అన్న పాత పథకాన్ని కొన్ని మార్పులుచేసి తిరిగి ప్రారంభించాడు. ఈ పథకాలు ప్రారంభించినట్లు కార్మిక సంస్థలకూ, యువతకూ 2 కోట్ల ఎస్‌ఎంఎస్‌లు పంపించాడు. ఢిల్లీలోని విజ్ఞాన్‌భవన్‌లో సకల కళావల్లభుడిగా ప్రహసనాన్ని నడిపాడు.

భారతీయ జనతాపార్టీ మాతృసంస్థ అయిన జనసంఘ్ సంస్థాపకుడైన దీనదయాళ్ పేరుకు ప్రాచుర్యం కల్పించటంతోపాటు, శ్రమ అన్న పదంతో శ్రామికుల ఉద్ధరణే దాని లక్ష్యమన్న భావాన్ని కార్మికులలో కలిగించేందుకు మోడి పూనుకున్నాడు.

చిన్న పరిశ్రమలలో పనిచేస్తున్న 3 కోట్లమంది కార్మికులకు పెన్షన్, ఇఎస్ఐ, ద్రవ్య సౌకర్యాలు వంటివి లేవన్నది వాస్తవం. కార్మికులలో 93 శాతం మంది అనియత రంగంలోనే పనిచేస్తున్నారనీ, వారికి ప్రావిడెంట్ ఫండ్, పెన్షన్‌వంటి సౌకర్యాలు లేవన్నది అందరకూ తెలిసినదే. వారికి పని ప్రదేశాలలో ప్రమాదాలనుండి భద్రత కూడా లేదు. ప్రతి ఏటా వేలాదిమంది పారిశ్రామికరంగ పని ప్రదేశ ప్రమాదాలలో అశువులు బాస్తున్నారు. కాంట్రాక్టు కార్మిక పద్ధతి వారి మెడలపై కత్తిలా వుంది. సంఘటిత రంగంలో కూడా కార్మికులకు చెందవలసిన ప్రావిడెంటు ఫండును యాజమాన్యాలు దిగమింగటం ఏటేటా పెరుగుతున్నది. పనిభారం, పని గంటలు, ఓవర్‌టైమ్ వేతనం, కనీస వేతన చెల్లింపులలో యాజమాన్యాలు కార్మిక చట్టాలను తుంగలో తొక్కుతున్నాయి.

ఈ దేశ కార్మికవర్గ మెదుర్కొంటున్న ఈ ముఖ్య సమస్యలేవీ ప్రధాని మోడీకి పట్టలేదు. కానీ బడాపెట్టుబడిదారులకు లబ్ధి చేకూర్చే లక్ష్యంగల పథకాలకు శ్రమ అన్న పదాన్ని జేర్చి కార్మికుల కన్నుగప్పేందుకు పూనుకున్నాడు.

అంతర్జాతీయ ద్రవ్యనిధి (ఐ.ఎం.ఎఫ్) అన్న సామ్రాజ్యవాద ద్రవ్యసంస్థ మేనేజింగ్ డైరెక్టరు "విశ్వవిధాన కార్యక్రమం" అన్న నివేదికను అక్టోబరు 9న విడుదల చేశాడు. దానిలో భారత్ వృద్ధిని సాధించాలంటే విదేశీ పెట్టుబడుల మదుపుకు అనుకూల చర్యలు చేపట్టాలనీ, దానిలో కార్మికరంగ సంస్కరణలు కీలకమైనవనీ పేర్కొన్నాడు. భారతదేశంలోని కార్మిక చట్టాలు కాలం చెల్లిపోయినవనీ, తమకు అనుకూలంగా వాటిని మార్చివేయాలనీ బడాబూర్జువావర్గం చాలా ఏళ్లనుండి గగ్గోలు పెడుతున్నది. భారత్‌లోని పత్రికలు నోరున్న వారందరూ బూర్జువా వర్గానికి వంతపాడుతున్నారు. ఇటీవల మోడీ అమెరికాకు వెళ్లి అక్కడి వాణిజ్యవేత్తలను కలిసినప్పుడు వారందరూ ఇదే డిమాండును చేశారు.

ఇప్పటికే పౌరసమాజ కేంద్రం, ప్రజాద్రవ్య విధాన జాతీయసంస్థ, శాసనవిధాన విధి సంస్థలు కలిసి 100 చట్టాలకు కాలం చెల్లిపోయిందనీ, వాటిని రద్దుచేయాలనీ చెప్పాయి. రద్దు చేయమని సూచించిన వాటిలో వున్న కార్మిక చట్టాలు ఇవి : 1. బాలల (శ్రమ నిరోధ) చట్టం, 1973; 2. వారంతపు సెలవులచట్టం 1942; 3. మైకా గనుల కార్మిక సంక్షేమనిధి చట్టం – 1946; 4. ఇనుము, మాంగనీస్, క్రోమియం ఖనిజ గనుల కార్మికసెస్ చట్టం (1976); 5.బీడీ కార్మిక సంక్షేమ సెస్ చట్టం(1976); 6. బీడీకార్మిక సంక్షేమనిధి చట్టం(1976) 7. సినిమా కార్మిక సంక్షేమ సెస్ చట్టం (1976); 8. సున్నపురాయి, డొలమైట్ గనుల కార్మిక సంక్షేమనిధి చట్టం(1972); 9. భారత బాయిలర్ల చట్టం(1923) వగైరాలు.

ఈ చట్టాలన్నింటికీ కాలం చెల్లిందట; వీటిని రద్దుచేయాలట; ఈ చట్టాల్లో వున్న లోపాలేమిటో వివరాలు చెప్పరు. ఈ పారిశ్రామిక రంగంలో కార్మికులకు కొన్ని రక్షణలు కల్పిస్తున్న ఈ చట్టాలను రద్దుచెయ్య పూనుకున్నారు. ఈ చటాల్లో అధికభాగం భారత ఖనిజ వనరుల రంగానికి చెందినవే. ఈ సంపదను సామ్రాజ్యవాదుల పెట్టుబడికి అప్పగించబూనుకున్నారు. వారి లాభదాహాన్ని తీర్చేందుకు ఈ రంగంలో కార్మికుల రక్షణ, సంక్షేమాన్ని బలిపీఠమెక్కిస్తున్నారు. బడాకంపెనీలు సామాజిక బాధ్యతను నెరవేర్చాలని ప్రచారం చేస్తున్నారు. లాభాలలో 2 శాతం దీనికోసం ఖర్చుచేస్తున్నట్లు అవి ప్రచారం చేస్తున్నాయి. కాగా స్వచ్ఛభారత్ అన్న ఒకరోజు చీపుళ్లతో వీధులూడ్చే పనికి చేసిన ఖర్చును సామాజిక బాధ్యత క్రింద చూపాయి. కాగా కార్మికుల సంక్షేమంపట్ల బాధ్యతను గాలికి వదిలేశారు.

కార్మికుల ప్రయోజనాల దృష్ట్యా చూసినప్పుడు ఏమాత్రం చాలని, అసలు ఉనికిలోనే కన్పించని "లేబర్ ఇన్స్‌పెక్టర్ల రాజ్యా"న్ని రద్దుచేయటమన్న సాకుతో శ్రమ సువిధపోర్టల్ తెరిచి, ఇన్‌స్పెక్టర్లను నియమించకపోవటాన్ని చట్టబద్ధం చేశారు. ఆవిధంగా చట్టాల అమలును పర్యవేక్షించవలసిన యంత్రాంగం లేకుండా చేసి, కార్మిక చట్టాలను తుంగలో తొక్కటానికి యాజమాన్యాల స్వేచ్ఛనిచ్చారు.

**(తరువాయి 2వ పేజీలో)**

# ప్రధాని జపాను పర్యటన
# మన దేశ మానవ, సహజవనరుల దోపిడీకి ఎర్రతివాచీ స్వాగతం

**2014** ఆగస్టు 30 నుండి సెప్టెంబరు 2 వరకు భారత ప్రధాని నరేంద్రమోడి జపాను దేశాన్ని సందర్శించాడు. ఇది, ఒక దేశ ప్రధాని మరోదేశంలో చేసిన పర్యటనగాకాక, ఉన్నతస్థాయి వ్యాపార, వాణిజ్య ప్రోత్సాహకుని పర్యటనగా ఆద్యంతమూ వ్యక్తమైంది.

ప్రధాని మోడి జపాను దేశంలోని క్యోటో నగరానికి మొదటగా చేరుకున్నాడు. జపానుదేశ ఆర్థిక, సాంకేతిక సహకారంతో వారణాసిని (2014 ఎన్నికలలో నరేంద్రమోడి ఇక్కడ నుండే గెలుపొందాడు) స్మార్ట్ నగరంగా అభివృద్ధి చేసేందుకు జపాను ప్రధాని షింజో ఎబేతో ఒప్పందంపై క్యోటోలో ఆయన సంతకం చేశాడు.

ఈ పర్యటనలో నరేంద్రమోడి రెండు కర్తవ్యాలు నిర్వర్తించాడు. 1. జపానుదేశ రాజకీయ నాయకులతోను వివిధ విభాగాల ప్రజాశ్రేణులతోను జనాంతికంగా సంభాషించాడు. జపానుదేశ చక్రవర్తికి మరియు ఆ దేశ ప్రధానికి నరేంద్రమోడి భగవద్గీతను, స్వామి వివేకానంద జీవిత చరిత్ర పుస్తకాలను బహుమతులుగా అందజేశాడు. డోలు వాయిద్యకారుడిగా తనకున్న నైపుణ్యాలను ప్రదర్శించి అతిథేయులైన జపనీయులను అలరించాడు. పిల్లనగ్రోవి వాయించటం ద్వారా, భారతీయ పురాణగాథలను చెప్పటం ద్వారా ప్రాథమిక పాఠశాల విద్యార్థులను మోడి ఆకట్టుకున్నాడు. 'బుద్ధుని భూమి' నుండి వచ్చిన వ్యక్తిగా ఆయన తనను తాను పరిచయంచేసుకున్నాడు. మహిళా విశ్వవిద్యాలయంలో ఆయన మాట్లాడుతూ బాలికా విద్యకు, మహిళా సాధికారితకు తాను గట్టి ప్రోత్సాహకుడినని పేర్కొంటూ మహిళా లోకాన్ని ప్రభావితం చేయబూనుకున్నాడు. తన మంత్రివర్గంలో 25 శాతం మహిళలేనని, విదేశాంగశాఖా మంత్రి కూడా మహిళేనంటూ ఆయన గర్వంగా ప్రకటించాడు. 2. మోడి మొత్తంగా 5 సందర్భాలలో ప్రసంగించాడు. ఈ అన్ని సందర్భాలలోనూ ఆయన తన ప్రసంగక్రమం నుండి ప్రక్కకు వచ్చి భారతదేశం వచ్చి జపాను దేశ పెట్టుబడిదారులను పెట్టుబడులు పెట్టవలసిందిగా ఆహ్వానిస్తూ, అనేక రాయితీలతో వూరిస్తూ వచ్చాడు. ప్రస్తుతం ఢిల్లీలో 'ధృడమైన ప్రభుత్వం' వున్న కారణంగా గత 50 సం॥లుగా సాధించలేని అభివృద్ధిని ఐదు సం॥లలో సాధిస్తామంటూ ఆయన జపాను పెట్టుబడిదారులతో చెప్పాడు. భారతదేశంలో పెట్టుబడులు పెట్టడానికి, వ్యాపారం చేయడానికి, జపాను పెట్టుబడిదారులకు అన్ని అవకాశాలు కల్పించేందుకు తమ ప్రభుత్వం కృత నిశ్చయంతో కట్టుబడి వుందని ఆయన పేర్కొన్నాడు. జపాను దేశ విదేశాంగ వ్యాపార సంస్థ సహ అతిథేయులుగా జరిగిన ఒక కార్యక్రమంలో టోక్యో స్టాక్ఎక్ఛేంజి వద్ద మోడీ చేసిన ప్రధానోపన్యాసంలో 'రెడ్‌టేప్' (పనులలో జాప్యం) ఉండబోదని, ఎర్రతివాచీ స్వాగతం ఎదురుచూస్తోందని పేర్కొన్నాడు. పథకాలన్నీ సత్వరంగా ఆమోదం పొంది అమలు కావటానికి ప్రధానమంత్రి కార్యాలయం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తుందని ఆయన హామీ ఇచ్చాడు. డెమోక్రసీ (ప్రజాస్వామ్యం), డెమోగ్రఫీ (జనసంఖ్యాశాస్త్రం) డిమాండ్ (గిరాకీ) అనబడే జపాను దేశపు మూడు 'డి'ల పట్ల భారతదేశం ఆకర్షితురాలవుతోందని ఆయన పేర్కొన్నాడు. 'ఆకర్షణీయమైన చౌకధరలకు సరుకుల తయారీకి జపాను వ్యాపార వాణిజ్య వర్గాలకు భారతదేశం బహుచక్కని గమ్యస్థానంగా వుంటుంద'ని ఆయన నొక్కి చెప్పాడు. 'భారతదేశానికి మించిన తగిన స్థానం మరొకటి లేదు' 'భారతదేశంలో 50 నగరాలు నూతనంగా మెట్రో ప్రాజెక్టులతో సిద్ధంగా వున్నాయి' 'ఈ వ్యాపారం ఎంత పెద్ద స్థాయిలో వుంటుందో మీరు ఊహించారా?' 'జపాను దేశ ఉత్పత్తుల తయారీకి భారతదేశంలోని ప్రాంతాలు దేవుడిచ్చిన బహుమతులు' 'ప్రస్తుతం 49 శాతం మాత్రమే విదేశీ ప్రత్యక్ష పెట్టుబడిని అనుమతించిన యుద్ధ పరికరాల తయారీ రంగంలోకి జపాను ప్రవేశిస్తే, ఇతర చిన్నదేశాల యుద్ధ అవసరాలను కూడా జపాను సరఫరా చేయగలుగుతుంది.' ఒక్కమాటలో చెప్పాలంటే మోడి సందేశం సూటిగా, సరళంగా ఇలా వుంది : 'భారతదేశం రుచికరమైన మెత్తని మాంసం. నమిలే శ్రమ కూడా లేకుండా అమాంతం మింగి వేయవచ్చు'. భారతదేశాన్ని గతంలో పాలించిన ప్రభుత్వాలు, వారి ప్రతినిధులు దేశంలోని శ్రమశక్తిని, సహజవనరులను దొడ్డిదోవల్లో, గంభీర పదాలమాటున విదేశీ సామ్రాజ్యవాద దోపిడీదారుల వద్ద తాకట్టుపెడితే, అమ్మకానికి అంగడి సరుకుగా వుంచితే, ప్రస్తుత మోడీ ప్రభుత్వం సాధ్యమైనంత నగ్నంగా ఇవే విధానాలను అమలు చేస్తోంది.

మోడీ జపాను పర్యటన సందర్భంగా మొత్తంగా ఐదు ఒప్పందాలపై ఇరుదేశాల ప్రధానులు సంతకాలు పెట్టారు. 'జపాను - ఇండియా వ్యూహాత్మక మరియు ప్రపంచస్థాయి భాగస్వామ్యం'ను 'ప్రత్యేక వ్యూహాత్మక మరియు ప్రపంచస్థాయి భాగస్వామ్యం'గా మార్చేందుకు వారు నిర్ణయించారు. 'జపాను-ఇండియా పెట్టుబడుల ప్రోత్సాహక భాగస్వామ్యా'న్ని వారు ప్రకటించారు. రక్షణరంగం, తయారీ రంగం, మౌలిక వసతుల కల్పన రంగం, ఇంధన రంగం, రవాణా రంగం, సామాజిక విభాగాలు, అంతరిక్ష రంగంలో సహకారం, స్మార్ట్ నగరాలు, మొదలైన వాటిలో రానున్న 5 సం॥ల కాలంలో 2.1 లక్షల కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు సిద్ధంగా వున్నట్లు జపాన్ ప్రకటించింది. రానున్న ఐదు సం॥ల కాలంలో భారతదేశంలో ప్రస్తుతమున్న జపాను పరిశ్రమల సంఖ్యను రెట్టింపు చేసేందుకు సిద్ధంగా వున్నట్లు ప్రకటించింది.

ఈరోజు భారతదేశంలో పార్లమెంటులో అత్యధిక స్థానాలను కైవసం చేసుకున్న 'ధృడమైన ప్రభుత్వం' వుందని మోడీ గొప్పగా చెప్పుకొంటూ వచ్చాడు. అంటే దీని అర్థం, వీరు తమ 'ధృడత్వాన్ని', మనదేశానికి, దేశ ప్రజలకు ప్రమాదకరంగా పరిణమించిన సామ్రాజ్యవాద దేశాల విధానాలను, చర్యలను వ్యతిరేకించేందుకు ఉపయోగించగలుగుతారా? ఎట్టి పరిస్థితుల్లోనూ అలా వ్యవహరించరు. పార్లమెంటులో అత్యధిక స్థానాలను గెలుచుకున్న ప్రభుత్వాలలో ప్రస్తుత బిజెపి నాయకత్వంలోని ఎన్‌డిఏ ప్రభుత్వమేమీ మొదటిది కాదు. అత్యధిక పార్లమెంటు స్థానాలతో ప్రభుత్వాలనేర్పరచిన గత ప్రభుత్వాలన్నీ, పాలకులందరూ భారతదేశంలో సామ్రాజ్యవాదుల విచ్చలవిడి దోపిడీకి వినయపూర్వకంగా ద్వారాలు తెరిచినవారే! అనిర్దిష్టమైన లేదా కొద్దిపాటి ఆధిక్యతలతో అధికారాన్ని చేజిక్కించుకున్న ప్రభుత్వాలు కూడా సామ్రాజ్యవాదుల అడుగులకు మడుగులొత్తే విధానాలను అనుసరించేందుకు ఏమాత్రం తటపటాయించలేదు. వాస్తవంలో, 'ధృడ ప్రభుత్వం' అని నరేంద్రమోడి ప్రకటించటమనేది జపాను మరియు ఇతర దేశాల సామ్రాజ్యవాదులకు, భారత ప్రజల నుండి వారికేమీ ముప్పు ఏర్పడబోదని, సామ్రాజ్యవాద దోపిడీపట్ల ప్రజల వ్యతిరేకతను తమ 'ధృడమైన ప్రభుత్వం' ఉక్కుపాదం మోపి అణచి వేస్తుందని వారందరికీ గట్టి హామీ ఇవ్వటమే! ఇది నిజంగా సిగ్గుచేటైన విషయం.

ఆర్థిక విధానాలే తన విదేశాంగ విధానాన్ని నడిపే శక్తిగా నరేంద్రమోడి ప్రకటించుకుంటున్నాడు. ఆర్థిక విధానాలంటే అతని ఉద్దేశ్యమేమిటి? స్వతంత్రకు, స్వావలంబనకు కట్టుబడిన ప్రభుత్వ ఆర్థిక విధానాలా ఇవి? లేక లొంగుబాటు పాలకుల దళారీ ఆర్థిక విధానాలా? కనుక, పాలించేవర్గం, పాలకులను బట్టి ఆర్థిక విధానాల అర్థం మారిపోతుంటుంది. ఇక్కడ, సహాయం అందించేదిగా, పెట్టుబడులు పెట్టేదిగా జపాను దేశం వుండి షరతులను నిర్దేశించగలిగిన పరిస్థితిలో వుండగా, భారత ప్రభుత్వం, భారత పాలకులు సహాయాన్ని, పెట్టుబడులను ఆశించే స్థితిలో వున్నారు. సామ్రాజ్యవాదుల పెట్టుబడులకనుగుణంగా మన దేశంలో చట్టాలను, విధి విధానాలను మార్పుచేసి, మనదేశంలో వారి దోపిడీ సజావుగా సాగిపోయేందుకు వీలుగా ఆకర్షణీయమైన, సౌకర్యవంతమైన పరిస్థితులను కల్పించాల్సి వుంటుంది. కనుక, జపాను - భారతదేశాల ఆర్థిక స్థితిగతులలోనున్న ఈ తేడా, ఈ దేశాల మధ్య అసమాన సంబంధాలకు, ముఖ్యంగా భారత ప్రజానీకానికి నష్టదాయకంగా పరిణమించనున్నాయి. భారత ప్రభుత్వం జోలెపట్టుకుని దయనీయంగా అడుక్కునే స్థితిలో, విదేశీ పెట్టుబడి, విదేశీ సాయంపై ఆధారపడి దీనంగా ఎదురుచూసే స్థితిలో వుండగా, దేశం మరో భిన్నమైన స్థితిలో వుంటుందని ఊహించలేము.

ప్రపంచంలోని వివిధ దేశాలను దోపిడీ చేసుకోవటం ద్వారా కూడబెట్టుకున్న తమ ఆర్థిక, రాజకీయ, సైనిక శక్తులతో, నేటి ప్రపంచంలో అమెరికా సామ్రాజ్యవాదులు ఆధిపత్య శక్తిగా వుండి పెట్టుబడిదారీ ప్రపంచానికి నాయకత్వం వహిస్తున్నారు. ప్రపంచంలోని కార్మికవర్గం మరియు అణచివేతకు గురయ్యే ప్రజానీకపు వ్యతిరేకతలను; అమెరికా ఆధిపత్యంలోని ఏకధృవ ప్రపంచాన్ని కొనసాగనీయకుండా బహుళ ధృవ ప్రపంచాన్ని కోరుకునే వివిధ సమూహాల, శక్తుల వ్యతిరేకతలను అణచివేస్తూ అమెరికా తన ఆధిపత్యాన్ని ప్రపంచంపై రుద్దేవ్యూహాన్ని కొనసాగిస్తోంది. ప్రపంచాధిపత్యం కోసం వారి వ్యూహంలో భాగంగా, అమెరికా సామ్రాజ్యవాదులు ఆసియాదేశాలను తమఆధిపత్యంలో వుంచుకునే వ్యూహాన్ని అనుసరిస్తున్నారు. ఆసియా ఖండంలో తన ఆధిపత్యం సుస్థిరంకాకుండా శక్తివంతమైన అవరోధంగా వున్న చైనాకు వ్యతిరేకంగా చాలా కాలంగా అమెరికా సామ్రాజ్యవాదులు భారత దేశాన్ని తమ వ్యూహాత్మక భాగస్వామ్యంలో నిలుపు కోవటానికి ప్రయత్నాలు సాగిస్తూ వున్నారు. ఈ వ్యూహాత్మక భాగస్వామ్యంలో జపాను కూడా కలిసే వుంది.

1939-45 కాలంలో జరిగిన రెండవ ప్రపంచ యుద్ధంలో జపాను సామ్రాజ్యవాదులు హిట్లరు నాయకత్వంలోని ఫాశిస్టుకూటమిలో భాగంగా వున్నారనే విషయం మనందరకూ తెలిసిందే. యుద్ధంలో ఫాశిస్టు కూటమి చిత్తయిన కారణంగా, ఘోరమైన ఓటమి పొందిన కారణంగా, ప్రపంచాధిపత్యంలోనూ, తద్వారా ఆసియాపై ఆధిపత్యంలోనూ భాగం పంచుకోవాలనే వారి కలలు చెదిరిపోయాయి. మారిన పరిస్థితులలో నేడు ఆసియాలో అమెరికా నేతృత్వంలోని వ్యూహాత్మక కూటమిలో జపాన్ చేరింది. అయినప్పటికీ, చెదిరిన తమ కలలను సాకారం చేసుకోవాలనే స్వీయ కోర్కెలు, ఆకాంక్షలు వారికున్నాయి. జపాను దేశ ప్రస్తుత ప్రధాని షింజో అబె ఈ కోర్కెలను, కలలను సూచనాత్మకంగా పేర్కొన్నాడు. అమెరికా నేతృత్వంలోని వ్యూహాత్మక కూటమిలో భారతదేశం ఒక భాగస్వామిగా వుండాలని మాత్రమేగాక, భారతదేశంతో ప్రత్యేక సంబంధాలు అభివృద్ధి చేసుకునేందుకు కూడా ఆయన ప్రయత్నిస్తున్నాడు. 'రానున్న దశాబ్ద కాలంలో జపాను - భారత సంబంధాలు జపాను - అమెరికా, జపాను - చైనా సంబంధాలను మించిపోయినా ఆశ్చర్యంలేదు' అని ఆయన పేర్కొన్నాడు. కనుక, సామ్రాజ్యవాద శక్తుల నేతృత్వంలో ప్రమాదకరమైన వుచ్చులోకి భారతదేశం లాగబడుతోందన్నమాట!

కాంగ్రెస్ నాయకత్వంలోని గత యుపిఏ ప్రభుత్వం జపానుతో వ్యూహాత్మక సంబంధాల అభివృద్ధికి, ఆసియాలో అమెరికా నేతృత్వంలోని వ్యూహాత్మక కూటమికి భారతదేశాన్ని ముడివేసే క్రమంలో చాలా ముందుకు సాగింది. యుపిఏ ప్రభుత్వ చెప్పులలో కాళ్ళుదూర్చిన నరేంద్రమోడి నాయకత్వంలోని ఎన్‌డిఏ ప్రభుత్వం, ఈ విధానాల కొనసాగింపుకే కట్టుబడి వుంది. కనుక, తన జపాను దేశ పర్యటన సందర్భంగా మోడీ రాజకీయాలను ప్రక్కన పెట్టజాలడు. జపాను, అమెరికాలతో (ఆస్ట్రేలియా కూడా చేరింది) వ్యూహాత్మక భాగస్వామ్యానికి తాము ఇప్పటికీ కట్టుబడి వున్నామని జపాను పాలకులకు ఆయన మరోమారు గట్టి హామీనిచ్చాడు. 18వ శతాబ్ది నాటి ఆలోచనలతో ఉన్నవారు ఆక్రమణలు సాగిస్తూ ఇతర దేశాల సముద్ర జలాలలోకి ప్రవేశిస్తున్నారంటూ చైనాను ఉద్దేశించి మోడీ పరోక్షంగా వ్యాఖ్యానించాడు. దక్షిణ చైనా, తూర్పు చైనా సముద్ర ద్వీపాలలోని ప్రాదేశిక వివాదాలలో చైనా వైఖరిని భారతదేశం వ్యతిరేకిస్తున్నదనే సందేశాన్ని జపాను పాలకులకు చేరవేసేందుకు ఈ వ్యాఖ్యానం ద్వారా మోడీ ప్రయత్నించాడు.

ఈ పరిస్థితి చైనాకు తెలుసు. చైనాకు వ్యతిరేకంగా, భారతదేశాన్ని తమతో కూడగట్టుకోవాలనుకునే అమెరికా, జపాన్‌ల ఎత్తుల పట్ల చైనా గమనింపుతో వుంది. అదే సమయంలో, భారతదేశంలోని పాలకవర్గాల గ్రూపులు చైనాతో ఆర్థిక సంబంధాలు అభివృద్ధి చేసుకోవటానికి ఆసక్తిగా వున్నాయనే విషయం కూడా చైనాకు తెలుసు. చైనా ఈ అంశాన్ని ఆధారంచేసుకోవాలనుకుంటున్నది. 2014 సెప్టెంబరు మధ్యకాలంలో చైనా అధ్యక్షుని భారతదేశ పర్యటన దీనిలో భాగమే. భారతదేశం - చైనాల మధ్య పెరిగే ఆర్థిక సంబంధాలు, అమెరికా, జపాన్ దేశాలతో భారతదేశ సంబంధాలపై భవిష్యత్తులో ఏవిధంగా ప్రభావం చూపుతాయనేది వేచి చూడాలి.

మనదేశ మానవవనరులను, సహజ సంపదలను సామ్రాజ్యవాదుల ఆధిపత్యానికి, యధేచ్ఛగా వారి దోపిడీకి అప్పగించే 'అభివృద్ధి' పంథాను సారాంశంలో భారత పాలకులు అనుసరిస్తూ వస్తున్నారు. ఇది అత్యంత వినాశకరమైన పంథా. అదేవిధంగా, అమెరికా నేతృత్వంలోని వ్యూహాత్మక భాగస్వామ్యంలో భారతదేశం చేరటం, జపానుతో ప్రత్యేక లేక వ్యూహాత్మక సంబంధాలను అభివృద్ధి చేసుకోవటం వంటివన్నీ ఆత్మహత్యా సదృశమైనవి. ఎందువల్లనంటే, ఈ సామ్రాజ్యవాద దేశాల వ్యూహాలన్నీ ప్రపంచంపైనా లేదా ప్రత్యేక ప్రాంతాలపైనా ఆధిపత్యాన్ని ఏర్పరచుకునేందుకు ఉద్దేశించబడినవే. సామ్రాజ్యవాద దేశాలతో భాగస్వామ్యంగా చెప్పుకోబడేది - సామ్రాజ్యవాదుల లక్ష్యాల సాధన కోసం తమ చేతిలో పనిముట్టుగా భారతదేశాన్ని మలచుకొనేందుకే! సామ్రాజ్యవాదుల దోపిడీ, బెదిరింపు, జోక్యం, ఆధిపత్యం, దురాక్రమణ యుద్ధాలలో బాధితులైన ప్రజల పక్షాన, ఆయా దేశాల పక్షాన నిలవటమే భారతదేశానికి సరైన స్థానంగా వుంటుంది. సామ్రాజ్యవాదాన్ని వ్యతిరేకించే ఉమ్మడి అంశంపై ప్రపంచవ్యాపిత ప్రజానీకం యొక్క, ప్రత్యేకించి ఆసియా దేశాల ప్రజానీకపు ఐక్యతను, సంఘీభావాన్ని నెలకొల్పుకోవటమే నేటి తక్షణావసరం.

**16-9-14**

***(అక్టోబరు 2014 'క్లాస్ స్ట్రగుల్' నుండి)***

---

**విస్తరించని నూనెగింజల...** (5వపేజీ నుండి)

పామాయిల్ గెలలకు ఇస్తున్న ధర కూడా రైతులకు ప్రయోజనకరంగా లేదు. ధర కూడా నిలకడగా వుండక ఎప్పుడు ఏ ధర పలుకుతుందోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. 2014 మార్చిలో టన్ను ఆయిల్‌పాం గెలకు 7951 రూ॥ ధర ఇవ్వగా ఒక్క నెల వ్యవధిలోనే 7824 రూ॥కు పడిపోయింది. అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి పామాయిల్ ధర తగ్గిందనే నెపంతో మిల్లు యజమానులు ధరను తగ్గించి రైతాంగాన్ని దోచుకొంటున్నారు.

దేశంలో వంటనూనెల కొరతకు పాలకుల విధానాలే కారణం. నూనె గింజల ఉత్పత్తి, వాటి విస్తీర్ణం పెరగకపోవటానికి, నూనెలు దిగుమతి చేసుకోవటం వలన బహుళజాతి సంస్థలు పెద్దమొత్తంలో లాభాలు తరలించుకొనిపోవటానికి పాలకులే కారణం. భారత రైతాంగం దీన్నిగమనించి నూనెగింజల ఉత్పత్తితోపాటు ఇతర పంటలను అధికంగా పండించేందుకు విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు, మొక్కలు డ్రిప్ పరికరాలు 50శాతం సబ్సిడీ యిచ్చి రైతాంగానికి అందచేయటమే కాకుండా, న్యాయమైనధరలు చెల్లించాలని పాలకులను డిమాండ్ చేయాలి. అప్పుడు మాత్రమే వంటనూనెలతో పాటు ఇతర ఆహార ధాన్యాలు సామాన్యులకు అందుబాటులోకి వస్తాయి. అందుకోసం రైతాంగంతో పాటు ప్రజలందరూ ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ఉద్యమించాలి. ✡

---

**చుండూరు కేసులో హైకోర్టు తీర్పు నేపథ్యంలో...**

## 'జడ్జీల నియామకం - వారి జవాబుదారీతనం'పై
## 'చుండూరు దళితుల న్యాయపోరాట కమిటి' ఆధ్వర్యంలో

**2014 నవంబర్ 26వ తేదీన మ.12 గం॥కు విజయవాడ జింఖానాగ్రౌండ్స్‌లో ప్రాంతీయ సదస్సు**

అధ్యక్షులు :
**కామ్రేడ్ సింహాద్రి ఝాన్సి**
రాష్ట్ర అధ్యక్షులు
రైతుకూలీ సంఘం(ఆం.ప్ర.)

అరుణోదయ, ప్రజాకళాకారుల సమాఖ్య, జనచైతన్యమండలి, ఆం.ప్ర. ప్రజానాట్యమండలి సంస్థలచే సాంస్కృతిక ప్రదర్శనలు ఉంటాయి

**ఇంకా, వివిధ దళిత, పజాసంఘాల నాయకులు ప్రసంగిస్తారు.**

ప్రధాన వక్త : **బొజ్జా తారకం**
ఛైర్మన్ - చుండూరు దళితుల న్యాయ పోరాట కమిటి
హైకోర్టు సీనియర్ అడ్వకేట్
ఆర్.పి.ఐ. జాతీయ ప్రధాన కార్యదర్శి

# మహిళల సాధికారత, సమానత్వాలు సామ్రాజ్యవాద ప్రపంచీకరణ సృష్టించిన ఎండమావులు

**తమ** సామ్రాజ్యవాద ప్రపంచీకరణ విధానాల గురించి ప్రపంచ పెట్టుబడిదారీ వ్యవస్థ ఎంతగా గప్పాలు కొట్టుకుంటున్నప్పటికీ, వారి ఆడంబర వాగ్దానాలు, భారీ నినాదాలు ఏవైనప్పటికీ - వాస్తవాచరణలో వారి ప్రకటనలు, నినాదాలన్నీ మోసపూరితమైనవని, తమ దోపిడీకి, ముఖ్యంగా మహిళా శ్రమశక్తి దోపిడీకి అనుగుణంగా విధానాలను తీవ్రతరం చేయటమే వారి ఉద్దేశ్యమని స్పష్టమౌతోంది.

సామ్రాజ్యవాద ప్రపంచీకరణ ప్రస్తుత కాలంలో కూడా మహిళా సమస్యలో-మహిళలపై సాగుతున్న దోపిడీ, అణిచివేత సమస్యలో-మార్పేమీలేదని, మహిళా సమానత్వమనేది ఎండమావేనని వివిధ నివేదికలు స్పష్టంగా పేర్కొంటున్నాయి.

ప్రపంచ కార్మికసంస్థ (ఐఎల్ఓ) 'మహిళల మాతృత్వ పరిరక్షణ' అంశంపై ఇటీవల విడుదలచేసిన నివేదికలో అనేక వాస్తవాలను వెల్లడి చేసింది. ప్రపంచంలోని మహిళా కార్మికులలో అత్యధికులకు అనగా దాదాపు 83 కోట్లమంది మహిళా కార్మికుల మాతృత్వానికి రక్షణలేదని, వీరిలో 80శాతం మహిళలు ఆఫ్రికా, ఆసియా దేశాలలోనే వున్నారని ఆ నివేదిక పేర్కొంది. మాతృత్వం అంశంలో వివక్ష పాటించటమనేది ప్రపంచ వ్యాపితంగా ఒక విధానంగా అమలవుతోంది. భద్రతతోకూడిన మాతృత్వం, తల్లీబిడ్డల ఆరోగ్య సంరక్షణలనేవి మహిళల ఉత్పాదకతకు, గౌరవప్రదమైన పనికి, పని ప్రదేశంలో లింగపరమైన సమానత్వానికి కేంద్రంగావున్న కారణంగా మాతృత్వ పరిరక్షణ మౌలిక కార్మిక హక్కుగా వుండాల్సివుంది. ఈ అంశంలో మహిళలకు సరైన భద్రత కల్పించే అంశంపై ఐఎల్ఓ 1919, 1952, 2000 సం॥లలో 3 మాతృత్వ పరిరక్షణ సదస్సులను నిర్వహించింది. గర్భిణీ స్త్రీలకు, అప్పుడే బిడ్డకు జన్మనిచ్చిన మహిళలకు; ప్రసవంతర్వాత, ప్రసవానికి ముందు ఆరోగ్య, భద్రతా ప్రమాదాలను ఎదుర్కోకుండా నిరోధించే చర్యలతోసహా వేతనంతో కూడిన శలవు, మాతృత్వం మరియు శిశు ఆరోగ్య రక్షణ, తల్లిపాలిచ్చేందుకు మధ్యమధ్యలో విరామాలు కల్పించాలని పేర్కొనటంతోపాటు మాతృత్వ కారణంగా పనిలో వివక్షను, పని నుండి తొలగించటాల నుండి రక్షణ కల్పించి, ప్రసవానంతర శలవు తర్వాత పనిలోకి తిరిగి రావటాన్ని ఒక హక్కుగా గ్యారంటీ చేస్తూ ఈ సదస్సులలో స్పష్టమైన నిర్ణయాలు చేశారు.

సామ్రాజ్యవాద ప్రపంచీకరణ విధానాల అమలుతో మరింత అధికంగా మహిళా కార్మికులు పెట్టుబడిదారీ వుత్పత్తి సంబంధాలలోకి వచ్చి చేరారు. 'మహిళాసాధికారత' 'మహిళలకు సమానావకాశాలు' 'మహిళలకు సమానస్థాయి' వంటి తన విశిష్టమైన వాగ్దానాలతో మహిళా కార్మికుల శ్రమను, సహజ సంపదలను మరింతగా దోచుకొని సూపర్ లాభాలు గడించటమే సామ్రాజ్యవాద ప్రపంచీకరణ ప్రధాన లక్ష్యంగా వుంది. పెట్టుబడిదారీ విధానం - పార్ట్‌టైమ్, తాత్కాలిక, క్యాజువల్, పీస్‌రేట్‌పని వంటి అస్థిర పనులలోకి పరిగణించదగిన స్థాయిలో మహిళలకు ఉద్యోగావకాశాలను కల్పించింది. ప్రపంచ ఆర్థిక సంక్షోభంతో లింగ అసమానత్వంవంటివి మరింత పెరిగిపోతూ, మహిళల శ్రమశక్తి అమానవీయ, దుర్భర దోపిడీకి గురవుతూ దీనినుండి మహిళా కార్మికులను రక్షించుకోవల్సిన అవసరం పెరుగుతోంది.

అనేక వివక్షా వ్యతిరేక చట్టాలున్న అభివృద్ధి చెందిన పెట్టుబడిదారీ దేశాలలో, యూరోపియన్ యూనియన్ సభ్యదేశాలలో కూడా, పరిగణించదగిన స్థాయిలో మాతృత్వంపై ఆధారపడిన వివక్ష కొనసాగటమనేది, ఈ వివక్ష ఒక ప్రపంచవ్యాపిత సమస్యగా కొనసాగుతున్నదనే అంశాన్ని తెలియజెప్తున్నది. గర్భిణీలైన కార్మిక మహిళలను, ప్రసవించిన తల్లులను ఉద్యోగాలకు రాజీనామా చేయాలని వత్తిడితేవటం వంటి వేధింపులు రుమేనియా, స్పెయిన్, లిథ్వేనియా వంటి దేశాలలో యాజమాన్యాలు అమలు చేస్తున్న విధానాలుగా వున్నాయి. క్రొయేషియా, గ్రీసు, ఇటలీ, పోర్చుగల్ దేశాలలో తేదీలు పూరించకుండా 'ఖాళీ రాజీనామా పత్రాలను' ముందే రాసి, సంతకం చేయించుకొని ఉద్యోగంలో చేరే సమయంలోనే మహిళా కార్మికులనుండి తీసుకొని, వారు గర్భందాల్చిన వెంటనే లేదా దీర్ఘకాలం అస్వస్థులైన వెంటనే, లేదా కుటుంబ బాధ్యతల కారణంగా ఎక్కువకాలం విధులకు హాజరు కాకుంటే, ఆ 'రాజీనామా పత్రాల'తో వారిని ఉద్యోగం నుండి తొలగించే చర్యలు ప్రపంచ ఆర్థికసంక్షోభం తీవ్రమౌతున్న క్రమంలో మరింతగా పెరుగుతూ వస్తున్నాయి. ప్రపంచ ప్రసిద్ధిగాంచిన రెడీమేడ్ దుస్తులన్నీ ఆసియా దేశాలలోని పరిశ్రమలలో, ప్రత్యేకించి సెజ్‌లలో ఉత్పత్తవుతున్నాయి. కాగా, ఈ పరిశ్రమల యాజమాన్యాలు, ఈ పరిశ్రమలలో 20-25 సం॥ల వయసున్న అవివాహితులైన యువతులను మాత్రమే పనులలోకి తీసుకోవటం - మాతృత్వ పరిరక్షణ సౌకర్యాలు కల్పించాల్సిన అవసరం లేకుండా తప్పించుకునేందుకేననేది బహిరంగ రహస్యమే! ఇండియా, బంగ్లాదేశ్, శ్రీలంక, వియత్నాం, చైనా మొదలైన ఆసియా దేశాలతోసహా ఎలక్ట్రానిక్ మరియు ఆటోమొబైల్ తయారీ పరిశ్రమలలోనూ; ఐటి పరిశ్రమలలోనూ ఈ రకమైన ఆచరణ స్పష్టంగా కనబడుతోంది. 'సాధికారత, మహిళలకు సమానావకాశాల' పేరిట నయా ఉదారవాద పెట్టుబడిదారీ వ్యవస్థ, శ్రమను దోచుకునే తన హీనమైన లక్ష్యాన్ని కప్పిపుచ్చుకునేందుకు మహిళా సమానత్వమనే నినాదాలను పెద్దగా వల్లెవేస్తూ దానిమాటున మహిళా శ్రమశక్తిని కారుచౌకగా దోచుకొంటోంది.

భారతదేశంలోని సంఘటిత విభాగాలలో లింగ ఆధారిత వ్యత్యాసాలు కొనసాగుతున్నాయనే అంశాన్ని 'పే చెక్ ఇండియా' నిర్వహించిన మరో సర్వే వెల్లడి చేసింది. భారతదేశంలోని వివిధ రాష్ట్రాలలో లింగ బేధాల కారణంగా వేతనాలలో వ్యత్యాసాలను సర్వే నివేదికలో పేర్కొన్నారు. ఉత్తరాఖండ్‌లో మహిళా కార్మికులు తమతో సమాన పనిచేస్తున్న పురుష కార్మికులకంటే 9 శాతం తక్కువ వేతనాలు పొందుతున్నారు. అదే బీహార్‌లో 63శాతం తక్కువగా వేతనాలు పొందుతున్నారు. 30 సం॥ల కంటే తక్కువ (18-30 సం॥లు) వయస్సున్న మహిళా కార్మికులు అదే వయస్సుగల అదే పనిచేసే పురుషకార్మికుల కంటే 23.07 శాతం తక్కువ వేతనాలు పొందుతున్నారు. ఉన్నత విద్యార్హతలుగల వారిలో ఈ వ్యత్యాసాలు అధికంగా వున్నట్లు ఈ సర్వే నివేదిక పేర్కొంది. 10వ తరగతి కంటే తక్కువ విద్యార్హతగల మహిళలకు, పురుషులకు ఈ వ్యత్యాసం 9.37 శాతం కాగా, సిఏ, సిఎస్, ఐసిడబ్ల్యుఏ లేదా అందుకు సమానమైన వున్నత విద్యార్హతగల మహిళలు, పురుషులకంటే 44.25 శాతం తక్కువ వేతనాలు పొందుతున్నారు. కళలు, వినోదం వంటి పరిశ్రమలలో పనిచేసే మహిళలు పురుషులకంటే 41.17శాతం తక్కువ వేతనం పొందుతున్నారు. ఇంకా, 31 సం॥లు, ఆపై బడి అనుభవం కలిగిన మహిళలు కూడా, పురుషులకంటే 78.23 శాతం తక్కువ సంపాదన పొందగలుగుతున్నారు. మహిళల వైవాహిక జీవితస్థితి అనేది కూడా లింగపరమైన వేతన వ్యత్యాసాలపై ప్రభావం చూపుతోంది. అవివాహితులుగా నున్న మహిళలు, అవివాహితులుగానున్న పురుషులకంటే 26.53 శాతం తక్కువ వేతనాలు పొందుతుండగా, విడాకులు పొందిన మహిళలు 28.53 శాతం తక్కువ వేతనాలు పొందుతున్నారు. "ఒక సాధారణ అభివృద్ధి క్రమంలో వేతనాలలో సమానత్వం సాధించటమనేది ఒక సుదూర కల" అని ఈ సర్వే నివేదిక పేర్కొంది. "ఏ దేశమూ లింగ ఆధారితంగా వేతనాలలో వ్యత్యాసాలను సంపూర్తిగా తగ్గించలేకపోయింద"ని సర్వే నివేదిక ఎత్తిచూపింది. "లింగ ఆధారిత వేతనాలలో వ్యత్యాసాలనేది వ్యవస్థీకృతమైంద"ని సర్వే పేర్కొంది.

ఇంతేగాక, 'మాన్‌స్టర్ ఇండియా' నిర్వహించిన మరో సర్వేలో కూడా 30శాతం మాత్రమే మహిళా ఉద్యోగినులు వున్న మనదేశంలోని ఐ.టి. విభాగంలో కూడా తీవ్రస్థాయిలో లింగపరమైన అంతరం వున్నట్లుగా పేర్కొంది. భారతదేశపు అత్యాధునిక విభాగమైన ఐటిరంగం మొదటి నుండీ పురుష పక్షపాతంగా వుండటమేగాక, తమవద్ద పనిచేసే మహిళా ఉద్యోగినులకు పురుష ఉద్యోగులకంటే 29శాతం తక్కువ వేతనాలు చెల్లిస్తున్నది. ఐటి విభాగంలో పనిచేసే ఓ పురుష ఉద్యోగి గంటకు మొత్తం 359.25 రూ॥ వేతనం పొందుతూ వుండగా, అదే విభాగంలో పనిచేసే ఓ మహిళా ఉద్యోగిని 254.04 రూ॥ వేతనం పొందుతోంది. చాలా తరచుగా మహిళలకంటే పురుష ఉద్యోగులు పర్యవేక్షక అధికారులుగా పదోన్నతులు పొందగలుగుతున్నారు. ఐటి రంగంలో మహిళల వివాహ స్థితిగతులనేవి, వారి అవకాశాల కొరతకు ఒక కారణంగా పేర్కొనబడుతోంది. 'మహిళల సమానత్వం' 'మహిళలకు సమానావకాశాలు' ప్రపంచవ్యాపితంగా ఎంత మోసకారితనంతో అమలుచేయబడుతున్నాయో ఈ ఉదాహరణలతో అర్థమౌతోంది. పెట్టుబడిదారీ విధానం, ఈ విధమైన గంభీర, పదాడంబర నినాదాలివ్వటం, కేవలం మహిళలను అధికాధికంగా ఉత్పత్తి రంగంలోకి ఆకర్షించి, తమ సూపర్‌లాభాల సాధనకు వారి కారుచౌక శ్రమశక్తిని దోపిడీ చేసుకొనేందుకు మినహా, మరొకందుకు కాదు.

దాదాపు అన్నిదేశాల్లోనూ తగిన చట్టాలున్నప్పటికీ, వాటిని పూర్తిగా అమలుచేయకపోవటంవలననో, లేక సక్రమంగా అమలు చేయకపోవటంవలననో ఒకే పనిచేస్తున్న మహిళా కార్మికులు తమ సహ పురుష కార్మికులతో సమానంగా చూడబడటంలేదని, పైన పేర్కొన్న సర్వే నివేదికలు వివరంగా, బలంగా నొక్కి చెపుతోన్నాయి. ఆర్థిక సంబంధాలలో మహిళలకు సమానత్వాన్ని కల్పించటంలో పెట్టుబడిదారీవ్యవస్థ యొక్క వంచన, మోసకారితనం సరిగ్గా ఇక్కడే వుంది. పెట్టుబడిదారీ వ్యవస్థయొక్క వర్గస్వభావాన్ని మనం అవగాహన చేసుకోకపోయినట్లయితే, దాని మోసకారితనాన్ని మనం అర్థంచేసుకోలేము. తేలిక పదాల్లో చెప్పుకోవాలంటే, పెట్టుబడిదారీ విధానమంటే ఆర్థిక గూండాల యొక్క అంటే పెట్టుబడిదారీ వర్గం యొక్క క్రూరమైనపాలన మినహా, మరోటికాదు. పెట్టుబడిదారీ వ్యవస్థలో ప్రతి సమస్యా(సామాజిక, ఆర్థిక, రాజకీయ, నైతికపరమైన) తమ సూపర్ లాభాల సముపార్జనా లక్ష్యానికనుగుణంగానే దీర్ఘకాల దృష్టితో పరిష్కారం చేయబడతాయి. ఈ ప్రయోజనాంశమే, పురుషులకంటే చౌకగా మహిళా శ్రమశక్తిని దోచుకునేందుకు, పురుషులతో సమానంగా మహిళలను పరిగణించకుండా ఉండేందుకు కారణంగా వుంది. 'పురుషులతో సమానావకాశాలు' 'మహిళల సమానత్వం' అనే నినాదాలు పెట్టుబడిదారులు ముందుకు తెచ్చిన, ఫ్యూడల్ దోపిడీ అణచివేతలనుండి విముక్తి కలిగించే ప్రగతిశీల నినాదాలనే దాంట్లో సందేహం లేదు. ఏమైనా, పెట్టుబడిదారీ విధానం దాని అత్యున్నత, అంతిమదశ అయిన సామ్రాజ్యవాదదశకు చేరుకున్నాక, అది తన ఒకప్పటి అభివృద్ధికరమైన పాత్రను వదులుకొంది. కాగా, నిజాయితీ రాహిత్యంగా ఈ నినాదాలను తన ప్రయోజనాలకొరకు ఉపయోగించుకుంటూ తయారీ కార్యకలాపాలలోకి మహిళలను అధికాధికంగా ఆకర్షించుకొని వారి శ్రామికశక్తిని కారుచౌకగా దోచుకుంటూ వస్తోంది. ఈ కారణంగా ఒకవైపున తను ప్రగతిశీలమైనదిగా పోజుపెడ్తూ, ప్రజలను మోసగిస్తూ మరోవైపున ఉద్దేశపూర్వకంగా చట్టాలను అమలుచేయకుండా, తన ప్రయోజనాలను శక్తివంతంగా నెరవేర్చుకునేందుకు అనుగుణంగా వ్యవహరిస్తోంది. ఈవిధంగా, వ్యవస్థ గురించిన 'ప్రగతిశీల' లక్షణాల గురించిన భ్రమలలో ప్రజలను వుంచి, బాధలకు గురౌతున్న ప్రజానీకపు ఆలోచనలను వారి వర్గ స్వభావం నుండి మళ్ళించి, ద్వితీయ ప్రాధాన్యతగల అసమగ్ర, అప్రయోజకమైన చట్టాల అమలుకోసం ప్రాకులాడే విధంగా శక్తివంతంగా ప్రక్కకు మళ్ళించి, ఈ దోపిడీ వ్యవస్థ రద్దుకై పోరాడాలనే దానినుండి ప్రక్కదోవ పట్టిస్తున్నారు. అందువలనే, ప్రస్తుత ఈ సామ్రాజ్యవాద ప్రపంచీకరణ వ్యవస్థ మహిళా సమానత్వాన్ని ఎన్నటికీ సాధించబోదని నిస్సందేహంగా ఢంకాబజాయించి మనం చెప్పగలగుతున్నాం.

మహిళలకు సమానత్వం ఇంతటి హాస్యాస్పదంగా వుండగా, మహిళల భద్రత, గౌరవప్రదమైన, హుందా అయిన జీవనం అనేవి కూడా దీనికి ఏమాత్రం భిన్నంగా లేవు.

మహిళలపై అత్యాచారాల, హత్యల వంటి క్రూరమైనదాడుల ఘటనలు పెరుగుతున్నాయని వివిధ నివేదికలు పేర్కొంటూవున్నాయి. వీటికి వ్యతిరేకంగా ప్రపంచ వ్యాపితంగా నిరసన, ఆగ్రహావేశాలు వ్యక్తమౌతున్నాయి. ప్రత్యేకించి భారతదేశంలో ఈ దుర్మార్గాలు తీవ్రస్థాయిలో సాగుతున్నాయి.

మహిళలపై అత్యాచారం, హింసల విషయంలో అమెరికా, బ్రెజిల్ మొదటి, రెండవ స్థానాలలో నున్నాయని, భారతదేశం 3వ స్థానంలో వుందని ఐక్యరాజ్యసమితి నేరధోరణుల సర్వే నివేదికలు తెలియజేస్తున్నాయి. ఈ నివేదికల ప్రకారం, భారత దేశంలో 22, 172 అత్యాచారకేసులు నమోదయ్యాయి. కాగా భారతదేశంలో ఈ నేరాల సంఖ్య రోజురోజుకీ పెరుగుతోంది.

జాతీయ నేర నమోదుసంస్థ - 2013 తాజా గణాంకాల ప్రకారం 2012 సంవత్సరంతో పోల్చితే మనదేశంలో మహిళలపై అత్యాచారాలలో 35 శాతం పెరుగుదల నమోదైందని, మహిళలపై వేధింపులు, దౌర్జన్యాలలో 56శాతం అధికంగా నమోదైందని స్పష్టమౌతోంది.

'గార్డియన్' వార్తా పత్రికలోనూ, ఆపై 31-5-14న 'ది హిందూ' పత్రికలోనూ ప్రచురితమైన ఇస్టెల్లెటాంగ్ రచించిన 'నా పురుష మిత్రులందరకూ బహిరంగలేఖ'లో పారిశ్రామికంగా అభివృద్ధి చెందిన 'ప్రజాస్వామిక' దేశాలుగా చెప్పబడుతున్న అమెరికాలోనూ, యూరోపియన్ యూనియన్ దేశాలలోనూ మహిళలు పురుషుల చేతిలో ఎంతటి అనాగరికంగా చూడబడుతున్నారో ఆమె స్పష్టంగా వెల్లడిచేసింది.

22 సం॥ల ఇలియట్ రోడ్జర్ అనే అతను కాలిఫోర్నియాలో ఏడుగురిని కాల్చిచంపి ఆపై తనకు తాను కాల్చిచంపుకొని అందుకు ముందుగా 'పథకం ప్రకారం మహిళలపై ప్రతీకారం తీర్చుకోవటం'పట్ల తన తీవ్ర అసహ్యతను తెలియజేస్తూ ఓ ప్రణాళికను, ఓ వీడియోను వదలి వెళ్ళిన ఘటనను ఆమె ఆ లేఖలో ఉదహరించారు. ఈ ఘటన జరగటానికి మూడురోజుల ముందు ఓ వ్యక్తి తనతో, తన మిత్రులతో లైంగిక సంపర్కానికి నిరాకరించిందనే కారణంగా ముగ్గురు మహిళలను దారుణంగా కాల్చిచంపిన ఘటనను ఆమె ఉదహరిస్తూ అమెరికాలోని న్యూయార్క్‌లో మహిళలు ఎంతటి భయానక పరిస్థితుల్లో జీవిస్తున్నారో వెల్లడిచేశారు. అమెరికా వీధుల్లో స్వయంగా వేధింపులకు గురైన తన స్వీయ అనుభవాన్ని కూడా ఆమె ఉటంకించారు. తాను ఇంటిని వదలి వీధిలోకి వెళ్ళేటప్పుడు తన వేషధారణో లేదా తన అలంకరణో తాను వేధింపులకు గురికాకుండా తప్పించటంలేదని పేర్కొంటూ, మహిళలపై హింస, వేధింపులనేవి అనునిత్యం జరుగుతున్నవేనని నిర్ధారించారు. అది లండన్ అయినా, పోలెండ్ అయినా మహిళల ఈ పరిస్థితుల్లో మార్పులేదని ఆమె వివరించారు. ఈ అభివృద్ధిచెందిన దేశాలలో బాయ్ ఫ్రెండ్స్‌గా వున్నవారు అత్యాచారాల గురించి హాస్యాలాడుతూ తమ గరల్ ఫ్రెండ్స్‌ను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని అంటూ ఈ 'అత్యాధునిక' ప్రపంచంలో మహిళల పరిస్థితి ఏమిటనే దానిని ఆమె వివరించారు.

యూరోపియన్ యూనియన్‌లోని 28 సభ్య దేశాలకు చెందిన 'హ్యూమన్ రైట్స్ మానిటరింగ్' సంస్థ నిర్వహించిన సర్వే ప్రకారం, యూరోపియన్ యూనియన్ దేశాలలోని ప్రతి ముగ్గురు మహిళల్లో ఒకరు భౌతిక, లైంగిక దాడులకు గురౌతున్నారని పేర్కొంది. 'ప్రపంచ ఆరోగ్యసంస్థ' అధ్యయనం ప్రకారం ప్రపంచ వ్యాపితంగా 30శాతంమంది మహిళలు తమకు అత్యంత దగ్గరగానున్న భాగస్వాములకారణంగా హింసకు గురౌతున్నారని స్పష్టంచేసింది. భౌతికమైన లేదా లైంగికమైన హింస ప్రపంచ వ్యాపితంగా 1/3 వంతు మహిళల ఆరోగ్యాలను తీవ్రంగా ప్రభావితం చేస్తోందని ఈ నివేదిక స్పష్టంచేసింది. కొన్ని తూర్పు ఐరోపా దేశాలకు పెద్దసంఖ్యలో వలసవచ్చిన మహిళలు ఎదుర్కొంటున్న భౌతికవేధింపులు, నిర్దిష్ట సంఘటనలను ఈ నివేదిక పేర్కొంది. ప్రత్యేకించి, హంగేరి, బెల్జియం, టర్కీ దేశాలలో వేధింపులకు లోనవుతున్న మహిళా బాధితుల దుస్థితి కలవరపరిచేదిగా వుంది.

టర్కీలోని ఓ పాఠశాలలో విద్యార్థినుల జననాంగాలన్నీ సుంతీ చేయబడ్డాయి. వారికి ఏవిధమైన లైంగిక కోర్కెలు కలగకుండా వుండేందుకుగాను, మత ఆదేశానుసారం ఈ చర్యకు పాల్పడ్డారనే ఇటీవలి ఓ వార్తాకథనం గగుర్పాటు కల్గిస్తోంది.

ప్రపంచ ఫుట్‌బాల్‌కప్ క్రీడలకు హాజరయ్యే వేలాదిమంది పురుషుల లైంగిక అవసరాలను సంతృప్తి పరిచేందుకు, బ్రెజిల్‌లో వేలాదిమంది మహిళలను, బాలికలను వేశ్యావృత్తికి సంసిద్ధంచేశారనే వార్త, వ్యక్తిగత స్వేచ్ఛతోసహా 'స్వేచ్ఛ'లన్నింటికీ మొనగాడుగా ప్రకటించుకుంటున్న పెట్టుబడిదారీ వ్యవస్థ యొక్క కుళ్ళు సంస్కృతిని గురించి ఎన్నో విషయాలను బట్టబయలు చేస్తోంది.

కాలిఫోర్నియాకు చెందిన సాంకేతిక పరిశ్రమలలోనూ మరియు సిలికాన్‌వ్యాలీ చుట్టుప్రక్కల ప్రాంతాలలోనూ ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకుంటూ హైటెక్ వేశ్యావృత్తి వర్ధిల్లుతూ వుండటం గురించిన ఇటీవలి ఓ వార్తాకథనం ద్వారా, పెట్టుబడిదారీ వ్యవస్థ మహిళల రక్తమాంసాలతో లాభసాటి వ్యాపారాన్ని ఏవిధంగా సాగించగలదో బోధపడుతోంది. కాలిఫోర్నియా, ఎరిక్ ఓముర ప్రాంతాలలోని వేశ్యాగృహ యజమానులలో ఒకరు, వేశ్యావృత్తిపై 5.4 మిలియన్ డాలర్ల లాభాన్ని గడిస్తున్నారని ఆ నివేదిక పేర్కొంది. అలిక్స్ టిఛెల్‌మన్ అనే ఓ వేశ్య హెరాయిన్‌ను అధిక మోతాదులో ప్రయోగించి ఫారెస్ట్ హేయస్ అనే అతని చావుకు కారణమైందనే ఆరోపణపై ఆమెను పోలీసులు అరెస్టు చేయగా, వెయ్యిడాలర్లచొప్పున ఆమెకు చెల్లించేందుకు సిద్ధంగావున్న 200మందికి పైగా ధనవంతులైన విటుల బాబితా ఆమె వద్ద లభించింది. అంతర్జాల అనుసంధానంతో వేశ్యావ్యాపారాన్ని పెట్టుబడిదారీ

# విస్తరించని నూనెగింజల సాగు దిగుమతులకే ప్రాధాన్యమిచ్చే పాలకులు

**ప్రజల** ఆహార అవసరాలు తీర్చటంకన్నా సామ్రాజ్యవాదుల, బహుళజాతి సంస్థల దోపిడీ ప్రయోజనాలే ముఖ్యమనుకునే పాలకులు, ఆహార పంటల ఉత్పత్తులను పెంచే విధానాలు చేపట్టకుండా వాటిని పెద్దఎత్తున దిగుమతి చేసుకొనే విధానాలు అమలుజరుపుతున్నారు. వంటనూనెల దిగుమతి అందులో భాగమే. ఫలితంగా నూనెల ధరలు పెరిగి సామాన్యుడికి అందుబాటులో లేకుండా పోతున్నాయి. 1992-93లో లక్షటన్నుల నూనెలు మాత్రమే దిగుమతి చేసుకోగా 2012-13 సం॥నాటికి కోటి టన్నులకు దిగుమతులు పెరిగాయి. ఇది నూనెల వినియోగంలో 57 శాతంగా ఉంది. 2012-13 సంవత్సరంలో 50 వేల కోట్ల విలువైన వంటనూనెలు దేశంలోకి దిగుమతయ్యాయి. మొత్తం వ్యవసాయ దిగుమతుల్లో వంటనూనెల వాటా 1991-92లో 6 శాతం ఉండగా ప్రస్తుతం 55 శాతానికి చేరుకొంది.

రైతాంగాన్ని ప్రోత్సహించకపోవటం వలన నూనెగింజల ఉత్పత్తిలో భారతదేశం చాలా వెనకబడి ఉంది. ప్రపంచ సగటు ఉత్పత్తితో పోల్చుకుంటే అందులో సగం మాత్రమే ఉత్పత్తి జరుగుతున్నది. ఇజ్రాయిల్ దేశంలో హెక్టారుకు వేరుశనగ 5,900 కిలోలు పండుతుంటే, భారతదేశంలో 1189 కిలోలు మాత్రమే దిగుబడి వస్తున్నది. స్విట్జర్లాండ్‌లో ప్రొద్దుతిరుగుడు పంట హెక్టారుకు 2985 కిలోలు దిగుబడి వస్తుంటే, మనదేశంలో 615 కిలోలు మాత్రమే వస్తున్నది. సోయాబీన్, ఆవాలు, నువ్వుల దిగుబడుల లోనూ ప్రపంచ సగటుకన్నా చాలా తక్కువ ఉత్పత్తి జరుగుతున్నది.

నూనెగింజల ఉత్పత్తులను పెంచే విధానాలు చేపట్టని పాలకుల విధానాల వలన నూనెల వినియోగంలో దేశ ప్రజలు చాలా వెనుకబడి ఉన్నారు. తలసరి వినియోగం 21 కిలోలు ఉండాలని ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యు.హెచ్.ఓ), ఆహార వ్యవసాయ సంస్థలు సూచిస్తున్నాయి. నూనెల తలసరి వినియోగం అమెరికాలో 49, ఐరోపా దేశాల్లో 51 కిలోలు ఉండగా భారతదేశంలో 11 కిలోలకు మించలేదు. వంటనూనెలు పొందలేని దేశంలోని 6 కోట్లమంది పోషకాహారానికి దూరమయ్యారు.

నూనెగింజల పంటల విస్తీర్ణాన్ని, ఉత్పత్తులు పెంచే విధానాలు పాలకులు చేపట్టకుండా విదేశాల నుండి దిగుమతి చేసుకోవటంపై తీవ్రమైన విమర్శలు వెల్లువెత్తాయి. ఈ వ్యతిరేకతను చల్లార్చేందుకు నూనెగింజల అధిక ఉత్పత్తుల కోసం పాలకులు కొన్ని చర్యలు చేపట్టక తప్పలేదు. 1986లో నూనె విత్తనాల సాంకేతిక పరిజ్ఞాన కార్యక్రమము (ఆయిల్ సీడ్స్ టెక్నాలజీ కమీషన్) చేపట్టి, ఆ పథకం ద్వారా సాంకేతిక పరిజ్ఞానం, విత్తనాలు, ఎరువులు, డ్రిప్, స్ప్రింక్లర్ వంటి పథకాలను సబ్సిడీలతో రైతాంగానికి అందించారు. అనుకూలమైన ధర కూడా పంటలకు లభించింది. ఈ కొద్దిపాటి ప్రోత్సాహంతోనే దేశంలోనూ, రాష్ట్రం లోనూ నూనెగింజల ఉత్పత్తి గణనీయంగా పెరిగింది. రాష్ట్రంలోని రాయలసీమ ప్రాంతంలోనూ, ఇతర రాష్ట్రాల్లో కూడా వేరుశనగ, ప్రొద్దుతిరుగుడు పంటల విస్తీర్ణం పెరిగింది. 1985లో 10.83 మిలియన్ టన్నులున్న నూనెగింజల ఉత్పత్తి 1997 నాటికి 24.35 మిలియన్ టన్నులకు చేరింది. ఈవిధంగా నూనెగింజల ఉత్పత్తిని రైతాంగం గణనీయంగా సాధించటంతో నూనెల దిగుమతి నామమాత్రంగా జరిగింది. రైతాంగానికి ప్రోత్సాహాన్ని ఇంకా పెంచి ఉంటే నూనెగింజల ఉత్పత్తిలో స్వయం సమృద్ధిని సాధించటం జరిగేది.

సామ్రాజ్యవాదులు సృష్టించిన సరళీకరణ ఆర్థిక విధానాలను వారికి ఊడిగం చేసే దళారీ పాలకులు 1991లో దేశంలో ప్రవేశపెట్టారు. అంతేకాకుండా ప్రపంచ వాణిజ్య ఒప్పందంపై సంతకం చేయటం, వ్యవసాయ ఒప్పందానికి ఆమోదం తెలపటం ద్వారా రైతుల ప్రయోజనాలను బలిపెట్టారు. ఫలితంగా ఇతర ఆహారధాన్యాలతోపాటు నూనెగింజల ఉత్పత్తులు పడిపోయాయి. రైతాంగానికి ఇస్తున్న ప్రోత్సాహకాలను విరమించటంతో, నూనెగింజల పంట నష్టదాయకంగా మారింది. రైతాంగం ఇతర పంటలవైపు మళ్ళటంతో నూనెగింజల పంటల విస్తీర్ణం బాగా పడిపోయింది.

ప్రపంచ వాణిజ్య ఒప్పందం ప్రకారం ఒకదేశం, మరొక దేశంలో ఏ వస్తువునైనా అమ్ముకునే అవకాశం ఉంది. మలేషియాలో అమ్ముడుపోకుండా పేరుకు పోయిన అమెరికా కంపెనీల ఆయిల్ నిల్వలు కె.జి. 10రూ॥ల చొప్పున దేశంలోకి కుప్పలు తెప్పలుగా దిగుమతి అయ్యింది. ఫలితంగా నూనెగింజలు కొనే దిక్కులేక వాటి ధరలు దారుణంగా పడిపోయాయి. రైతాంగం త్రీవంగా నష్టపోయారు. దీంతో దేశంలో నేడు 18 మిలియన్ టన్నుల వంటనూనెల వినియోగం జరుగుతుండగా ఇందులో 45 శాతం పామ్‌ఆయిల్ వాడకం ఉంది. భారతదేశంలో వంట నూనెల తలసరి వార్షిక వినియోగం 1950 సం॥లో మూడు కిలోలు ఉండగా 2010-11 నాటికి 11.2 కిలోలు ఉంది. ఈ తలసరి వినియోగం కూడా పేదలకు అందక, చాలా తక్కువ పరిమాణంతో సరిపెట్టుకొంటున్నారు. దేశంలో 2015 నాటికి 210; 2020 నాటికి 300 పైగా లక్షల టన్నులు వంట నూనెలు అవసరం ఉంటుందని నిపుణుల అంచనా.

పాలకులు దేశ ప్రయోజనాలను, ప్రజల అవసరాలను ఏమాత్రం పరిగణనలోకి తీసుకొన్నా దేశంలో నూనెగింజల ఉత్పత్తికి ఎన్నో అవకాశాలు ఉన్నాయి. వేరుశనగ, ఆవాలు, సన్‌ఫ్లవర్, ఆయిల్‌పాం పంటల ద్వారా దేశంలో నూనెల ఉత్పత్తి జరుగు తున్నది. ఈ పంటలకు అనేక రాష్ట్రాల్లో ఎక్కువ విస్తీర్ణంలో పండించటానికి అనుకూల పరిస్థితులు ఉన్నాయి. తరతరాలుగా ఆహారంగానూ, వంటనూనె గానూ వాడుతున్న వేరుశనగ, ఆవాలు, నువ్వులు తదితర పంటల ఉత్పత్తి పెంచేందుకు చర్యలు తీసుకోవటం ద్వారా వంటనూనెలలో స్వయం సమృద్ధి సాధించవచ్చు.

మన దేశంలో ఆయిల్ పాం సాగుని ప్రవేశపెట్టి 25 సంవత్సరాలైంది. దేశంలో లక్షా డెబ్భయ్ వేల ఎకరాల్లో రైతులు ఆయిల్ పాం సాగుచేస్తున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో ఇది అత్యధికంగా సాగౌతూ అగ్ర స్థానంలో ఉంది. ఆయిల్‌పాం పంటను అభివృద్ధిచేసే, సాగు విస్తీర్ణాన్ని పెంచే విధానాలు లేకపోవటం వలన ఈ సాగు నత్తనడకలో ఉంది. క్రూడ్ ఆయిల్ ఉత్పత్తి లక్షా 25 వేల టన్నులకే పరిమితమైంది. దేశంలో వివిధ రకాల మిశ్రమ నూనెగింజలు 15.18 మిలియన్ హెక్టార్లలో సాగౌతూ నాలుగు మిలియన్ టన్నుల చమురు ఉత్పత్తి జరుగుతోంది. ఈ సాగుని పెంచ గలిగితే వంటనూనెల ఉత్పత్తిలో స్వయం సమృద్ధిని సాధించగలుగుతాము. ఇది జరగాలంటే రైతాంగానికి అన్నిరకాలుగా ప్రోత్సాహం అందాల్సి ఉంది.

ఆయిల్‌పాం పంట ధర నిర్ణయంలోనూ భారత రైతాంగం నష్టపోతున్నారు. నూనె రికవరీ శాతం ఆధారంగానే అంతర్జాతీయ మార్కెట్ ఆయిల్‌పాం గెలలకు ధర నిర్ణయించబడుతుంది. మలేషియా కేంద్రంగా ఈ ధర ఉంటుంది. అక్కడి నూనెల కంపెనీలన్ని కార్గిల్‌లాంటి బహుళజాతి సంస్థల క్రింద వుండటంవలన వాటి ప్రయోజనాలకు అనుగుణంగానే ధర నిర్ణయించబడుతుంది. మలేషియాలో ఆధునిక యంత్రాలపై ఆయిల్‌పాం గెలలను గానుగ ఆడించటం వలన నూనె రికవరీ 20 శాతం పైగా వుంటుంది. భారతదేశంలో అలాంటి యంత్రాలు లేక రికవరీశాతం తక్కువగా వుండటంవలన ఆయిల్‌పాం గెలల ధర తక్కువగా నిర్ణయించబడుతున్నది.

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ప్రభుత్వ ఆధ్వర్యములో రాష్ట్ర సహకార నూనె ఉత్పత్తిదారుల సమాఖ్య(ఆయిల్ ఫెడ్) నిర్వహిస్తున్న రెండు ఆయిల్‌పాం మిల్లుల్లోనే రికవరీని ప్రమాణంగా తీసుకొంటున్నారు. ప్రైవేట్ మిల్లులు నూనె రికవరీని తక్కువ చూపిస్తున్నాయనే ఆరోపణలు రావటంతో, ఆయిల్‌ఫెడ్ మిల్లుల్లో వచ్చిన రికవరీని ఆధారం చేసుకొని సంవత్సరం మొత్తానికి ధర నిర్ణయించటం జరుగుతుంది. పశ్చిమగోదావరి జిల్లా పెదవేగి, ఖమ్మంజిల్లా అశ్వారావుపేటలో ఈ మిల్లులు వున్నాయి. ఈ మిల్లుల్లో కూడా రికవరీ శాతాన్ని తక్కువ చూపుతున్నారని రైతాంగం ఆందోళన చేశారు. ఈ మిల్లుల్లో నూనె రికవరీ 17 శాతానికి మించి రావటంలేదు. ఈ మిల్లుల్లో ఆయిల్‌పాం గెలలనుండి నూనె రికవరీని నిరంతరం తనిఖీ చేయటానికి పర్యవేక్షణ సంఘాన్ని ఏర్పాటు చేయాలని రైతాంగం డిమాండ్ చేయటంతో అందుకు ప్రభుత్వం అంగీకరించక తప్పలేదు.

ఆయిల్‌పాం గెలలను గానుగాడిన తర్వాత గింజలు మిగులుతాయి. వాటిని మరలా మరో యంత్రంపై గానుగాడితే మరింత నూనె వస్తుంది. మన రాష్ట్రంలో ఆయిల్‌ఫెడ్ మిల్లుల్లో గింజలను గానుగాడేందుకు యంత్రాలు లేక వాటిని టెండర్లద్వారా అమ్ముతున్నారు. ఈ గింజలను కొనుగోలుచేసి ప్రైవేట్ మిల్లులు వాటినుండి నూనె అమ్ముకొని లాభాలు గడిస్తున్నారు. ఆయిల్‌ఫెడ్ మిల్లుల్లో గింజలనుండి నూనె తీస్తే అమ్మిన ధరలో 30శాతం రైతులకు ఇవ్వాల్సి వుంది. ఆయిల్‌ఫెడ్ మిల్లులు ఆ పని చేయకపోవటం వలన రైతాంగం నష్టపోతున్నారు. దీనివలన రైతాంగంలో వ్యతిరేకత వస్తుందనే భయంతో గింజలు అమ్మగా వచ్చిన దాంట్లో రైతాంగానికి నామమాత్రంగా చెల్లిస్తున్నది. ఇది ఏమాత్రం ప్రయోజనకరంగా లేదని రైతాంగం అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు.

**(తరువాయి 3వ పేజీలో)**

---

Ô వ్యవస్థ ఎంత నికృష్టంగా సాగిస్తూ వుందో, దాని వంచనాత్మకత అంతా దీనితో వెల్లడవుతోంది.

2013 ఫిబ్రవరిలో డా॥ నికితాలెవీ అనే ఓ వైద్యుడు అనేకమంది మహిళల జననాంగాల ఫొటోలతో పట్టుబడి, ఆపై తనకు తానే కాల్చుకొని చనిపోయిన ఘటనొకటి వెలుగులోకి వచ్చింది. అమెరికాలోని జాన్‌హాప్‌కిన్స్ వైద్య ఆరోగ్య సంస్థలో మహిళల గర్భకోశ లేదా జననావయాల పరీక్షలు నిర్వహించే సందర్భాలలో రహస్య కెమేరాల ద్వారా ఆ వైద్యుడు వాటిని చిత్రీకరించాడనేది స్పష్టమైంది. 8వేలమంది బాధిత మహిళలు జాన్‌హాప్‌కిన్స్ వైద్యసంస్థపై 190 మిలియన్ డాలర్ల పరిహారాన్ని కోరుతూ కోర్టునాశ్రయించారు.

అభివృద్ధిచెందిన, ప్రజాస్వామిక పెట్టుబడిదారీ దేశాలలో మహిళల దుస్థితి ఈ విధంగా వుండగా, అభివృద్ధిచెందుతోన్న, అర్ధఫ్యూడల్ మరియు వెనుకబడిన దేశాలలో మహిళల బాధలు భిన్నమైన వివిధ రూపాలలో వున్నాయి.

క్రూరమైన అత్యాచారాలు, హత్యలకు గురికావటంతోపాటు, చెప్పనలవికాని వివిధ రూపాలలో ఘోరాలకు మహిళలు బలవుతున్నారు.

విబేధాలున్న సమూహాలు ప్రతీకారం తీర్చుకునేందుకు మహిళలపై హింసను సాధనంగా చేసుకోవటమనేది తీవ్రమైన సమస్యగా వుంది. కాంగో మొదలుకొని సోమాలియా; సిరియా మొదలుకొని శ్రీలంక యుద్ధ ప్రాంతాలలో మహిళలపై, బాలలపై హింస, నేరాలను నిర్భయంగా అధిక సంఖ్యలో సాగిస్తున్నారు. ఈవిధంగా యుద్ధ ప్రాంతాలలోని బాధిత మహిళల దుస్థితి తీవ్రమైన సమస్యగా ప్రస్తుతకాలంలో ముందుకొస్తోంది. కానీ, మానవహక్కుల గురించి, స్వాతంత్ర్యం తదితరాల గురించి గొంతు చించుకొనే ఐక్యరాజ్యసమితి, తన పరిధిలో హేగ్‌లోని అంతర్జాతీయ నేరన్యాయస్థానం (ఐసిసి) ముందుకు ఈ కేసులను తీసుకువచ్చి, బాధితులకు న్యాయం జరిగేలా చూడటానికి మాత్రం నిరాకరిస్తోంది.

ఆసియా ప్రాంతంలో, గర్భవతులైన మహిళలకు గర్భస్థశిశువుయొక్క లింగనిర్ధారణ పరీక్షలు జరిపి, ఆడశిశువు అని తేల్చుకున్న వెంటనే గర్భస్రావం చేయించే రూపంలో మహిళలపై హింస అధికంగా కొనసాగుతోంది.

అలాగే, 'పరువుహత్యలు' మరో రూపంలో కొనసాగుతున్న హింసగా వుంది. తమ అక్కచెల్లెళ్ళు లేదా కుమార్తెలు ఇతర కులాలకు, మతాలకు చెందిన వారినో లేక వారి కుటుంబ సభ్యుల ఆమోదం పొందని వారినో ప్రేమించటం, పెళ్ళాడటం లేదా వారితో కలసి పారిపోవటం వంటి సందర్భాలలో వారిని దొరక బుచ్చుకున్న తల్లిదండ్రులు, అన్నదమ్ములు, ఖప్ పంచాయితీల, కుల – మత పెద్దలు, పరువుపేరిట వారిని హత్యగావించటమనే చర్యలు, మన దేశంలో రోజువారీ ఘటనలుగా మారాయి.

అత్యాచార బాధితురాలినే పరువుపేరిట హత్య గావించటమనేది, మహిళలపై సాగుతున్న హింసలలో మరో భయానకమైనదిగా వుంది. అత్యాచార ఘటనలలో ఈ తరహా పరువుహత్యలు ఆఫ్ఘనిస్థాన్‌లో సర్వసాధారణంగా సాగుతూ, దాడికి పాల్పడిన నేరస్థుడిపై ప్రతీకారానికి బదులుగా బాధితురాలి కుటుంబానికి సంబంధించిన గౌరవం కాపాడుకునే చర్యలుగా ఇవి సాగుతున్నాయి. ఆఫ్ఘనిస్తాన్‌లో వెలుగులోకి వచ్చిన ఈ తరహా ఘటనలు 150 వరకూ వుండగా, మరి అనేకం నమోదుకావటం లేదని మానవ హక్కుల బృందాలు పేర్కొంటున్నాయి.

బదౌన్, బెంగుళూరు, లక్నోలలో ఇటీవల మహిళలపై జరిగిన హింసాత్మక దాడుల ఘోరమైన సంఘటనలు, భారతదేశంలోని వివిధ ప్రాంతాలలో వాటి కొనసాగింపుగా జరుగుతున్న ఘటనలు – మహిళలు, బాలికలపై హింస యొక్క విస్తృతిని నిర్ధారిస్తున్నాయి. బదౌన్‌లో జరిగిన ఘటన – మహిళలు, బాలికలపై ప్రత్యేకించి, గ్రామీణ ప్రాంతాల్లో కొనసాగుతున్న హింసను, కులపరమైన అత్యాచారాల హింసయొక్క వ్యాప్తిని మనకు తెలియజేస్తోంది.

అభివృద్ధి చెందిన పెట్టుబడిదారీ దేశాలలో మహిళలపై సాగుతోన్న హింస, పెట్టుబడిదారీ వ్యవస్థ స్వేచ్ఛపేరుతో పెంచిపోషిస్తున్న వికృత సంస్కృతి యొక్క స్వభావాన్ని చూపుతోంది. అది ప్రోత్సహిస్తోన్న స్వేచ్ఛాయుత జీవన విధానంగా చెప్పబడే దానియొక్క డొల్లతనాన్ని తెలుపుతోంది. కాగా అభివృద్ధిచెందుతోన్న, అర్ధ–ఫ్యూడల్ దేశాలలో పితృస్వామిక భావజాలంతో కూడి, సామాజికంగా అధికులుగా భావించుకునే పురుషుల ఆలోచనాధోరణితో భూస్వామ్య, కులతత్వ విలువలు కలగలసి మహిళలపై హింస సాగించబడుతూ వారంతా అమానవీయంగా, అథమంగా చూడబడు తున్నారు.

కనుక, అభివృద్ధి చెందిన పెట్టుబడిదారీ దేశాలలోనూ; అభివృద్ధి చెందుతూన్న మరియు వెనుకబడిన అర్ధ – ఫ్యూడల్, ఫ్యూడల్ దేశాలలోనూ లింగపరమైన అసమానతలనేవి వ్యవస్థీకృతంగా కొనసాగుతున్నాయి.

పెట్టుబడిదారీ దేశాలు మహిళలను పురుషులు అనుభవించదగిన విలాసవస్తువుగా, వ్యాపారంలో లాభాలార్జించే సాధనంగా ఉపయోగిస్తూ, ఈ విధంగా మహిళలకు 'లైంగిక హక్కు' నిచ్చే సంస్కృతిని ప్రోత్సహిస్తుండగా; అభివృద్ధిచెందుతూన్న, వెనుకబడిన దేశాలలో మహిళలు–పురుషుల అధీనంలోని వారుగా, వారి శరీరాలపై, ఆస్తులపై, వృత్తులపై హక్కులు నిరాకరించబడుతున్న వారుగా, అవమానకరంగా బ్రతుకులీడుస్తున్నారు.

అందువల్లనే, ప్రపంచవ్యాపితంగా మహిళలపై చట్టభీతిలేకుండా అంతకంతకూ ఏదో ఒక రూపంలో, ఏదో ఒక కారణంతో క్రూరమైన అత్యాచారాలు, హత్యల రూపంలో హింస కొనసాగుతూనే వుంది.

వర్గరహిత కమ్యూనిస్టు వ్యవస్థ దిశగాసాగే సామ్యవాదవ్యవస్థలో మాత్రమే దీన్ని పూర్తిగా అరికట్టటం సాధ్యమౌతుంది. మన చారిత్రక అనుభవంలో ఇది కార్యరూపం దాల్చిందనే అంశం రుజువైంది కూడా.

లెనిన్, స్టాలిన్‌ల కాలంలోని సోవియట్ యూనియన్, మావో కాలంనాటి చైనాలలోని సోషలిస్టు దేశాలలో వాస్తవిక అర్థంలో మహిళల స్వేచ్ఛ, స్వాతంత్ర్యం, మహిళా సమానత్వమనే వాటిని అనుభవించటాన్ని మనం ఇప్పటికే చూశాం. మహిళలకు అన్నిరంగాలలో పురుషులతో సమాన హక్కులు, అవకాశాలు; ఉద్యోగాలలో మాతృత్వపు సదుపాయాలు, నర్సరీలు, నర్సరీ పాఠశాలలు, యాంత్రీకరించబడిన గృహోపకరణాలు, సామూహిక వంటశాలల అధిక వినియోగం, మీదుమిక్కిలి వేశ్యా వృత్తిని రద్దుచేయటంవంటి పలు అంశాలతో రష్యా రాజ్యాంగం మహిళా విముక్తికి మార్గం వేసింది. చైనాలోనూ ఇతర సోషలిస్టు దేశాలలోనూ ఇదే తరహాలో మహిళా విముక్తి సాధ్యమైంది. కాగా, పెట్టుబడిదారీ విధాన పునరుద్ధరణతో – స్త్రీ పురుష అసమానత్వం, మహిళలపై హింసలతోపాటు అమానవీయమైన, అవమానకరమైన వేశ్యావృత్తివంటి సర్వదుర్గుణాలు ఈ దేశాలలో తిరిగి పుంజు కుంటున్నాయి.

సమాజంలో అత్యధికులుగావున్న కార్మికవర్గం యొక్క పాలనసాగే, వర్గాలను రద్దుచేసే సామ్యవాద వ్యవస్థలో మాత్రమే మహిళల సమానత్వం, భద్రత, మహిళలకు గౌరవం లభించటంతోపాటు మహిళలపై హింస, క్రూరత్వం, అవమానాలకు తావుండదనే విషయం మనకు ఈ అనుభవాలన్నింటి ద్వారా బోధపడ్తున్నది.

కనుక, మహిళలపై సాగే హింసాత్మక ఘటనలను ఖండించటానికో లేక నిరసించటానికో మాత్రమే పరిమితమైతే, అది ప్రగతిశీలమైనదిగా, విప్లవాత్మక మైనదిగా కనిపిస్తే కనిపించవచ్చుగాక. కానీ, ఇది మాత్రమే మహిళలకు సమానత్వాన్ని, హుందా అయిన జీవితాన్ని సాధించిపెట్టలేదనేది వాస్తవం. ప్రస్తుత దోపిడీ వ్యవస్థను రద్దుచేసి దానిస్థానే నూతన ప్రజాస్వామిక వ్యవస్థ, ఆపై సామ్యవాద వ్యవస్థలను ఏర్పరచే ఉద్యమాలతో చేయిచేయిగలిపి మహిళల విముక్తికోసం దృఢమైన ఉద్యమాన్ని నిర్మించటంద్వారానే, వాస్తవిక అర్థంలో మహిళలకు సమానత్వం, సంపూర్ణ రక్షణ సుసాధ్యం కాగలుగుతాయి. ✡

# ప్రపంచ వ్యాపితంగా కార్మికుల ఆందోళనలు

## లెబనాన్

2014 ఏప్రిల్ 13న-లెబనాన్ ప్రభుత్వ యాజమాన్యంలోని కంపెనీలలో పనిచేస్తున్న కార్మికులంతా సమ్మె చేపట్టారు. మెరుగైన వేతనాలను, పూర్తికాలపు పని ఒప్పందాన్ని వీరు డిమాండ్‌చేశారు. లెబనాన్‌లో వీరంతా ఓ భారీ నిరసన ప్రదర్శనను కూడా నిర్వహించారు.

## చైనా

చైనాలోని యూయెన్ ఇండస్ట్రియల్ లిమిటెడ్‌కు చెందిన 40 వేలమందికి పైగా కార్మికులు 2014 ఏప్రిల్ 5 నుండి సమ్మెలోకి వెళ్ళారు. నైక్, ఆడిడాస్‌వంటి ప్రముఖ కంపెనీల బూట్లను ఈ కంపెనీలో తయారుచేస్తారు. చైనా ప్రభుత్వ చట్టాల ప్రకారం సామాజిక భద్రతా నిధులను కేటాయించవలసిందిగా కార్మికులు కంపెనీ యాజమాన్యాన్ని డిమాండ్ చేస్తూ ఈ ఆందోళన చేపట్టారు. పదుల వేలసంఖ్యలో కార్మికులు పాల్గొన్న భారీ నిరసన ప్రదర్శనలను కార్మికులు నిర్వహించారు.

చైనాలోని జెజియాంగ్ రాష్ట్రం-నింగ్‌బాకు చెందిన బెయిలున్ కంటైనర్ పోర్టులో 10వేలమంది ట్రక్కు డ్రైవర్లు ఆగస్టు 18న తమ విధులను బహిష్కరించి, నౌకాశ్రయ అధికారుల ప్రధాన కార్యాలయం ఎదుట బైఠాయించి ఆందోళన చేపట్టారు. గత 8 సంవత్సరాలుగా పెంపుదల లేకుండా కొనసాగుతున్న లాగుడు సుంకాన్ని పెంచాలని వారు డిమాండ్ చేశారు.

## లండన్

ఏప్రిల్ 29న అండర్‌గ్రౌండ్ ట్యూబ్ కార్మికులు రెండురోజుల సమ్మె చేపట్టి, ట్యూబునెట్‌వర్క్‌కు చెందిన కార్యాలయాలన్నింటినీ మూసివేయటంద్వారా, ఉద్యోగాలలో కోత విధించే యాజమాన్య ప్రయత్నాలను నిరసించారు.

## సియాటెల్

పర్వతప్రాంత రాజధానినుండి సియాటెల్ నగర కేంద్రం వరకూ వందలాదిమంది కార్మికులు మే 2వ తేదీన నిరసన ప్రదర్శన నిర్వహించారు. కనీస వేతనాల పెంపును, వలసకార్మికులకు హక్కులను వారు డిమాండ్ చేశారు. ప్రదర్శకులు ఎర్రజెండాలను చేబూని తమ డిమాండ్లను ఎలుగెత్తి నినదిస్తూ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ధర్నా, ప్రదర్శనలకు ప్రభుత్వం అనుమతినీయ లేదు. ఆందోళనకారులపై పోలీసులు పెపర్‌స్ప్రేను ప్రయోగించి చెదరగొట్టారు.

## ఫ్రాన్సు

ఫ్రాన్సు దేశవ్యాపితంగా మే 7న జైళ్ళ సిబ్బంది అందరూ సమ్మె చేశారు. సిబ్బందిని కుదించివేసే ప్రభుత్వ చర్యలను, భద్రతా స్థితిగతులు దిగజారిపోవటాన్ని నిరసిస్తూ వారు ఈ ఆందోళనను చేపట్టారు.

సెప్టెంబర్ 15న ఎయిర్‌ఫ్రాన్స్‌కు చెందిన పైలెట్లు సమ్మె చేపట్టారు. ట్రాన్స్‌వియా అనే తక్కువస్థాయి గలిగిన అనుబంధసంస్థకు తమ ఉద్యోగులను బదిలీ చేయాలనే ఎయిర్‌లైన్స్ యాజమాన్య పథకాలను పైలెట్లు తీవ్రంగా వ్యతిరేకించారు. యాజమాన్యంయొక్క ఈ చర్య ఫలితంగా తమ పనిపరిస్థితులు, వేతనాలు మరింతగా దిగజారుతాయని వారు పేర్కొన్నారు. పైలెట్ల ఆందోళన ఒక వారంపాటు కొనసాగింది.

## టర్కి

మే 13న టర్కీలోని ట్రేడుయూనియన్స్ అన్నీ నిరసన సమ్మె చేపట్టాయి. 282 మందిని బలిగొన్న, అత్యంత ఘోరమైన సోమా గని ప్రమాదాన్ని నిరసిస్తూ కార్మికులు ఈ సమ్మెలో పాల్గొని, టర్కీలోని గనులన్నింటిలో భద్రతా ప్రమాణాలను పాటించాలని డిమాండ్ చేశారు.

ఇంగ్లాండుకు చెందిన ఈస్ట్ ఫార్మాకంపెనీ అనుబంధసంస్థ అయిన దేవాహోల్డింగ్‌లో పనిచేస్తున్న కార్మికులు, యూనియన్‌లో చేరిన కారణంగా తమలో 8 మంది కార్మికులను యాజమాన్యం విధులనుండి తొలగించటాన్ని నిరసిస్తూ పరిశ్రమ ముఖద్వారం వద్ద నిరసనాందోళన చేపట్టారు.

## అమెరికా

ఇన్‌ఫోసిస్, ఐబిఎమ్ మరియు మాన్‌పవర్‌లలో పనిచేసే సాంకేతిక కార్మిక బృందాలన్నీ తమ విధులను బహిష్కరించాయి. జూన్ 3న, అమెరికాకు చెందిన ఈ ప్రపంచస్థాయి సాంకేతిక పరిశ్రమలలోని సాంకేతిక కార్మిక బృందాలు నిరసన తెలిపాయి. 'అమెరికా గడ్డపై ప్రారంభించే పరిశ్రమలలో అమెరికా కార్మికులను ఉద్యోగాల నుండి మినహాయించండి' అనబడే ఈ పరిశ్రమ యాజమాన్యాల వివక్షాపూరిత విధానాలను కార్మికులు నిరసించారు.

## బ్రెజిల్

బ్రెజిల్‌లోని సావోపోలోలో సబ్‌వే కార్మికులంతా జూన్ 5న సమ్మెలోకి వెళ్ళారు. ఫుట్‌బాల్ ప్రపంచకప్పు క్రీడా సంబరాలకోసం ప్రభుత్వం పెద్దఎత్తున ప్రజాధనాన్ని ఖర్చుచేయటాన్ని వీరంతా నిరసించారు.

జూన్ 7 అర్ధరాత్రినుండి సావోపోలో మెట్రోరైలు కార్మికులు నిరసన సమ్మె చేపట్టారు.

బ్రెజిల్‌లోని సావోపోలో ఫుట్‌బాల్ ప్రపంచ కప్పు క్రీడల ప్రారంభానికి వారం ముందుగా భారీస్థాయి కార్మిక ఆందోళనలు బ్రద్దలయ్యాయి.

## ఇయు దేశాలు

యూరోపియన్ యూనియన్ సభ్యదేశాలన్నింటిలో ట్యాక్సి డ్రైవర్లు, రైల్వే కార్మికులు జూన్ 9న 24 గంటలపాటు వాహనాలను స్తంభింపజేశారు. రైళ్ళు, టాక్సీల నిర్వహణలో చేపట్టనున్న సంస్కరణలను వీరు వ్యతిరేకించారు. ఫ్రాన్స్‌లో ట్యాక్సి డ్రైవర్లే మొత్తం రహదారులను దిగ్బంధించారు. యూరోపియన్ యూనియన్‌లోని మాడ్రిడ్, లండన్, మిలన్, బెర్లిన్ మరి అనేక ఇతర నగరాలలో బార్సిలోనాలోనూ ట్యాక్సిడ్రైవర్లు సమ్మె చేశారు.

## స్వీడన్

మే 1వ తారీకు నుండి స్వీడన్ దేశవ్యాపితంగా రైల్వే కార్మికులంతా ప్రభుత్వ రైల్వే వ్యవస్థను ప్రైవేటీకరించటాన్ని వ్యతిరేకిస్తూ నిరవధిక సమ్మె చేపట్టారు. పూర్తిస్థాయిలో వేతన చెల్లింపులను ఎగవేయడానికే రైల్వే యాజమాన్యం, గంటలలెక్కన వేతన చెల్లింపు ఒప్పందాలతో కార్మికుల నియామకాన్ని చేబట్టిందని వీరు ఆరోపించారు. ఈ కార్మిక వ్యతిరేక ప్రభుత్వ విధానాలను వీరంతా తీవ్రంగా వ్యతిరేకించారు.

## దక్షిణాఫ్రికా

దక్షిణాఫ్రికాలోని ప్రపంచ ప్రసిద్ధిగాంచిన మూడు అతిపెద్ద ప్లాటినమ్ కంపెనీలకు చెందిన కార్మికులు 20 వారాలపాటు సమ్మె చేశారు. ఇంపాలా ప్లాటినమ్ హోల్డింగ్స్, ఆంగ్లో-అమెరికన్ ప్లాటినమ్ మరియు లోన్‌మన్‌లకు చెందిన ఈ కార్మికులు తమ వేతనాల పెంపును, మెరుగైన పనిపరిస్థితులను డిమాండ్‌చేస్తూ జూన్ 2వ వారందాకా సమ్మె చేశారు.

## ఇంగ్లాండ్

ప్రభుత్వ రంగంలో పనిచేసే పదిలక్షలమంది కార్మికులు యునైటెడ్ కింగ్‌డమ్‌లో జులై 10న హఠాత్తుగా సమ్మె చేయటానికి నెట్టబడ్డారు. వేతనాల చెల్లింపు, పెన్షన్లు, ఉద్యోగాలలో కోత, పదవీ విరమణ వయసులో మార్పులు, ప్రభుత్వ సేవలను ప్రైవేటీకరించటం వంటి అంశాలపై నెలకొన్న తీవ్రవివాదం కార్మికులు ఈ సమ్మె చేపట్టటానికి కారణమైంది. దేశవ్యాపితంగా నిరసన ధర్నాలు, ప్రదర్శనలు, పికెటింగ్‌లు తదితర ఆందోళనలలో కార్మికులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. గత దశాబ్ద కాలంలో దేశం ఎదుర్కొన్న రెండవ అతిపెద్ద పారిశ్రామిక కార్మికుల సమ్మె ఇదే.

## ఇటలి

జులై 28న, జర్మనీకి చెందిన థైసన్‌క్రప్ ఉక్కు కంపెనీకి చెందిన వందలాదిమంది కార్మికులు సమ్మెలోకి వెళ్ళారు. పరిశ్రమ ఖర్చులను తగ్గించే పేరుతో 550మంది ఉద్యోగాలలో కోతబెట్టోన్న, ఉత్పత్తిని సగానికి సగం తగ్గిస్తున్న యాజమాన్య చర్యలను కార్మికులు తీవ్రంగా నిరసించారు.

జులై 29న, ఇటలీ బహుళజాతి చమురు, సహజవాయు కంపెనీ అయిన ఇఎన్‌ఐలో 30వేల మంది కార్మికులు అకస్మాత్తుగా సమ్మెలోకి నెట్టబడ్డారు. కంపెనీని మూసివేయటమో లేదా లాభదాయకంగా లేని కొన్ని చమురు శుద్ధికర్మాగారాలను మూసివేయటంద్వారా ఆరువేలమంది ఉద్యోగాలు కోల్పోనున్నారు. కార్మికులు ఐక్యంగా ప్రభుత్వ ఈ చర్యలను నిరసించారు.

రోమ్‌లోని ఫియామిసినో విమానాశ్రయంలో బ్యాగేజి హ్యాండ్లర్స్ తమ ఉద్యోగ భద్రతను డిమాండ్‌చేస్తూ ఆగస్టు 5వ తేదీన సమ్మెలోకి వెళ్ళారు. ఈ కార్మికులంతా పనిచేస్తున్న అలిటాలియా సంస్థను, 2171 మంది ఉద్యోగులను కోత విధించాలంటున్న అబుదాబి విమానయానసంస్థ ఎతియాడ్‌తో కలిపివేయాలని యోచన చేయటాన్ని కార్మికులంతా వ్యతిరేకించారు.

## స్వాజి

జులై 31న, స్వాజీలాండ్‌లోని కాంగ్-పా టెక్స్‌టైల్స్ ఫ్యాక్టరీలో పనిచేస్తున్న కార్మికులంతా తమ వేతనాలపెంపు, చెల్లింపు సంబంధిత పలుడిమాండ్లపై సమ్మె చేశారు. పరిశ్రమ యాజమాన్యం కార్మికుల ట్రేడ్‌యూనియన్ కమిటీలో సభ్యులైన 30 మంది మహిళా కార్మికులను తాత్కాలికంగా విధులనుండి తొలగించింది. ఫ్యాక్టరీ కార్యకలాపాలను స్తంభింపజేస్తూ కార్మికులు పరిశ్రమ ప్రధానద్వారం ఎదుట బైఠాయించి ఆందోళన నిర్వహించారు.

## జాంబియా

2014 జులై చివరివారంలో టాంజానియా-జాంబియా రైల్వే అథారిటీవద్ద 3000 మంది కార్మికులు నిరవధిక సమ్మెకు పూనుకున్నారు. వీరంతా తమకు యాజమాన్యం బకాయిపడ్డ 5 నెలల వేతనాలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు.

## హంగరి

హంగరికి చెందిన 60 ట్రేడ్‌యూనియన్ల నుండి 400 మంది క్రియాశీల ప్రతినిధులు హ్యాండ్‌బుక్ టైర్ కంపెనీ అనే కొరియాకు చెంది టైర్ల తయారీ పరిశ్రమ ఆవరణ బయట ఆగస్టు 4వ తేదీన ఆందోళన చేపట్టారు. స్థానిక ట్రేడ్ యూనియన్ అధ్యక్షునిపై యాజమాన్య కక్షసాధింపు చర్యలను వీరంతా నిరసించారు.

## కెన్యా

కెన్యాలోని నైవషాకు చెందిన కారుటూరి పూవుల వ్యవసాయక్షేత్రంలో పనిచేస్తున్న కార్మికులు ఆగస్టు మొదటివారంలో నిదానంగా పనిని సాగిస్తూ తమ నిరసనను తెలియజేశారు. కార్మికులు తమ వేతనాల పెంపును డిమాండ్‌చేస్తూ సమావేశం నిర్వహించుకోవటంపట్ల ఆగ్రహించిన యాజమాన్యం యూనియన్‌కు చెందిన ఏడుగురు ప్రతినిధులను తొలగించటాన్ని నిరసిస్తూ కార్మికులు ఈ రూపంలో తమ నిరసనను వ్యక్తం చేశారు.

ఆగస్టు 11న కెన్యాలోని పౌరసేవకులు, తమకు జూన్, జులై నెలల్లో రావలసిన వేతన బకాయిల చెల్లింపును డిమాండ్‌చేస్తూ సమ్మె చేశారు. వేతనాలు చెల్లించడానికి ప్రభుత్వం వద్ద డబ్బులేదని కిరిన్యాగా కౌంటి గవర్నర్ చేసిన ప్రకటనతో ఆగ్రహించిన పౌర సేవకులు ఈ సమ్మెకు పూనుకున్నారు.

## నైజీరియా

ఆగస్టు 8న నైజీరియాలోని బీరూ, మాకుర్దిలతో సహా పలుపట్టణాలు, నగరాలలో కార్మికులు సమ్మె చేపట్టి, ప్రభుత్వం తమ వేతనాలలో కోతపెట్టటాన్ని తీవ్రంగా నిరసించారు.

నైజీరియన్ నేషనల్ పెట్రోలియం కార్పొరేషన్‌కు చెందిన కార్మికులు సెప్టెంబర్ 16 నుండి మొదలుకొని దేశవ్యాపితంగా నిరవధికంగా సమ్మె చేపట్టారు. పెన్షను ఏర్పాట్లలో వివాదం కారణంగా వారు ఈ ఆందోళనకు పూనుకున్నారు. కార్మికులకు రావలసిన పూర్తి బకాయిలను చెల్లించని ప్రస్తుత పెన్షను విధానం స్థానంలో సమగ్రమైన పెన్షను విధానాన్ని ఆందోళనకారులు డిమాండ్ చేశారు.

## జర్మని

అమెజాన్ సంస్థలో పనిచేసే వందలాది మంది కార్మికులు ఆగస్టు 14న జర్మనీలోని లీప్‌జిగ్, బాడ్‌హెర్స్‌ఫీల్డ్‌లోని తమ కార్యాలయాలనుండి వాక్ అవుట్‌చేసి వచ్చారు. జర్మనీలోని మెయిల్ మరియు రీటైల్ విభాగాలలోని పద్ధతుల స్థానంలో సమిష్టిగా బేరసారాలాడి ఒప్పందాలు చేసుకునే పద్ధతులను పాటించాలని వారంతా డిమాండ్ చేశారు.

## బంగ్లాదేశ్

ఆగస్టు 9న, సావర్‌లోని హెలికాన్ స్వెటర్ ఫ్యాక్టరీలోని కార్మికులు, తమ పరిశ్రమ ముందు బైఠాయించి మూలవేతనంలో కోత, పీస్‌రేట్లలో కోత నిర్ణయాలు ప్రకటించిన యాజమాన్య చర్యలను వ్యతిరేకిస్తూ ధర్నా చేపట్టారు.

ఆగస్టు 11న సావర్‌లోని అఘులియా పారిశ్రామిక ప్రాంతానికి చెందిన 'యాగిబంగ్లాదేశ్ గార్మెంట్స్' కార్మికులు వేలాదిమంది తమ విధులను బహిష్కరించి ధాకా శివారు ప్రాంతానికి చేరుకొని రోడ్లపై బైఠాయించారు. అతిస్వల్ప కారణాలతో యాజమాన్యం 26 మంది తమ సహ కార్మికులను హఠాత్తుగా తొలగించటాన్ని వారంతా ముక్తకంఠంతో ఖండించారు. తక్షణం తొలగించిన తమ సహకార్మికులను పనిలోకి తీసుకోవటంతోపాటుగా జులై నెలకుగాను తమకు చెల్లించాల్సిన వేతన బకాయిలను వెంటనే చెల్లించాలని కార్మికులు ఈ సందర్భంగా డిమాండ్ చేశారు.

2014 ఆగస్టులో టూబా గ్రూపు దుస్తుల తయారీ పరిశ్రమలలో పనిచేస్తున్న కార్మికులు 3 వారాలకు పైబడి తమ నిరసనలను కొనసాగించారు. టూబా గ్రూపుకు చెందిన 5 దుస్తుల పరిశ్రమ యూనిట్లను ఆగస్టు 19 నుండి యాజమాన్యం నిరవధికంగా మూసివేయటానికి వ్యతిరేకంగా వీరు ఈ ఆందోళన చేపట్టారు. మూసివేసిన ఫ్యాక్టరీలను తక్షణం తెరిపించాలని, నిల్వయున్న వేతన బకాయిలను వెంటనే చెల్లించాలని, 2012లో టూబా గ్రూపు సంస్థలలో అగ్నిప్రమాదానికి, అందులో 112మంది కార్మికుల మరణానికి కారణమైన డిల్వార్ హుస్సేన్‌కు లభించిన బెయిల్ ఆదేశాలను రద్దుచేయాలని కార్మికులంతా డిమాండ్ చేశారు.

ఆగస్టు 16న సావర్‌లోని బావన్ అప్పారల్స్ ఫ్యాక్టరీలో 400 మంది కార్మికులు తమ విధులు బహిష్కరించి నిరసనాందోళనకు పూనుకున్నారు. సకాలంలో వేతనాల చెల్లింపును వారు డిమాండ్ చేశారు. కార్మికులపై యాజమాన్యం తరచుగా సాగించే దౌర్జన్యాలు, వేధింపులు, దాడులను ఆపాలని, కార్మికులపై 30శాతం పనిభారం పెంపుచేసే చర్యలను విరమించుకోవాలని, ఇవే డిమాండ్లను అడిగినందుకుగాను పనులనుండి తొలగించిన పలువురు తమ సహ కార్మికులను వెంటనే పనిలో నియమించాలని ఈ కార్మికులు డిమాండ్ చేశారు.

ఏటిఎస్ దుస్తుల తయారీ పరిశ్రమ కార్మికులు, ఢాకా వెలుపలనున్న గజియాపూర్ పారిశ్రామిక మండలి వద్దనున్న ఫ్యాక్టరీ ఎదుట బైఠాయించి తమ నిరసన తెలియజేశారు. సెప్టెంబర్ 28న జరిగిన ఈ కార్యక్రమాన్ని పోలీసులు భగ్నం చేసి, లాఠీఛార్జీలో పలువురు కార్మికులను తీవ్రంగా గాయపరిచారు.

## ()పాకిస్తాన్

పాకిస్తాన్‌లోని, సింధ్ రాష్ట్రానికి చెందిన గాజుల తయారీ పరిశ్రమలో పనిచేసే ఆరులక్షలమందికి ప్రాతినిధ్యం వహించే బంగ్లా వర్కర్స్ యూనియన్‌కు చెందిన మహిళా కార్మికులు పాకిస్తాన్‌లోని హైదరాబాద్ ప్రెస్‌క్లబ్ ఎదుట ధర్నాచేసి, తమ డిమాండ్లను పరిష్కరించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. వేతనాలలో పెంపు, సామాజిక భద్రతాశాఖలో పేర్ల నమోదు, తమ బిడ్డల విద్య, వైద్య సౌకర్యాలు, కంప్యూటరీకరించిన జాతీయ గుర్తింపు కార్డులు, తమ నివాస ప్రాంతాలలో సక్రమమైన విద్యుత్తు, తాగు నీరు, వంటగ్యాసు సరఫరా; మెరుగైన పారిశుధ్య వ్యవస్థవంటి పలు అంశాలు వారి డిమాండ్లలో ముఖ్యమైనవి. ఈ పరిశ్రమలలో పనిచేస్తున్న అనేకమంది మహిళా కార్మికులు గాజుల తయారీ పరిశ్రమలో వినియోగించే విషపూరిత రసాయనాల కారణంగా క్యాన్సర్, అంధత్వం, క్షయ, కీళ్ళనొప్పులు, చర్మసంబంధిత వ్యాధులకు గురౌతున్నారు.

ఆగస్టు 19న లాహోర్ ఎలక్ట్రిక్ సప్లై కంపెనీ కార్మికులు, కంపెనీ ప్రధాన కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి, విద్యుత్తు లైన్లపై పెరిగిపోతున్న సిబ్బంది మరణాల గురించి పేర్కొంటూ వారి భద్రతా చర్యలను డిమాండ్ చేశారు. అప్పటికి రెండువారాల కాలంలో 25మంది లైన్‌మెన్లు విద్యుత్తు షాక్‌కు గురై ప్రాణాలొదిలారు.

## పాలస్తీనా

పాలస్తీనాలోని గాజా ప్రాంతానికి చెందిన 30వేల మంది కార్మికులు, ఇజ్రాయిల్ సాగిస్తోన్న ఎడతెరపిలేని దాడుల కారణంగా పనులు కోల్పోయారు. మొత్తం కార్మికులలో వీరు దాదాపు 10శాతంగా వున్నారు. 2007లో ఇజ్రాయిల్ దిగ్బంధనం తదనంతరం షుమారు 1,70,000 మంది తమ ఉద్యోగాలు కోల్పోయారు. ప్రస్తుతం ఇజ్రాయిల్ సాగిస్తోన్న బాంబుదాడుల ఫలితంగా అనేక పరిశ్రమలు, పనిప్రదేశాలు, వ్యాపార వాణిజ్య ప్రాంతాలు విధ్వంసానికి గురౌతూ వేలాదిమంది పనులు కోల్పోతున్నారు. ఎంతోమంది ఈ దాడులలో మరణిస్తున్నారు.

## కాంబోడియా

మధ్యకాంబోడియా కాంపాంగ్‌లోని చైనాకు చెందిన జియున్ యే దుస్తుల తయారీ పరిశ్రమలో పనిచేస్తున్న 3వేల మంది కార్మికులు ఆగస్టు 18న తమ విధులు బహిష్కరించి నిరసన కార్యక్రమం చేపట్టారు. తమ నెలవారీ బోనసులలో యాజమాన్యం 5 డాలర్లనుండి 20 డాలర్లవరకు బిగపట్టుకోవటాన్ని వీరు నిరసిస్తూ ఐదవ నెంబరు జాతీయ రహదారిని దిగ్బంధించారు.

ఆగస్టు 18న ఫ్నోమెన్‌ఫెన్‌లోని గ్లిన్‌ఫాంగ్ దుస్తుల తయారీ పరిశ్రమలో 400 మంది కార్మికులు మధ్యాహ్న భోజన అలెవెన్సును, గర్భిణీ స్త్రీ కార్మికులకు, అప్పుడే ప్రసవించిన తల్లులకు కల్పించాల్సిన సౌకర్యాలను డిమాండ్‌చేస్తూ ఆందోళనకు పూనుకున్నారు.

కాంబోడియాలోని బావెట్ నగరంలో యోలీ దుస్తుల తయారీ పరిశ్రమ కార్మికులు 800మంది విధులు బహిష్కరించి ఆగస్టు 18వ తేదీన ఒకటో నెంబరు జాతీయ రహదారిపై బైఠాయించారు. పనిప్రదేశాలలో వైద్య సదుపాయాలను, అప్పుడే బిడ్డలను ప్రసవించిన తల్లులకు 18 నెలలపాటు నెలకు 10 డాలర్ల అదనపు వేతనాన్ని, మరుగుదొడ్ల సౌకర్యాల మెరుగుదలను ఈ కార్మికులు తమ నిరసన సందర్భంగా డిమాండ్ చేశారు.

## ఐర్లాండ్

ఐరిష్ రైల్‌సంస్థలో పనిచేస్తున్న కార్మికులు నేషనల్ బస్ మరియు రైల్‌యూనియన్ ఆధ్వర్యంలో ఆగస్టు 24న 48 గంటలపాటు సమ్మె నిర్వహించారు. తమ వేతనాలలో 1.7 శాతం నుండి 6 శాతం వరకు కోత పెట్టడాన్ని వ్యతిరేకిస్తూ వారు ఈ ఆందోళన చేపట్టారు.

## ఈజిప్టు

కైరోలోని మిస్రా ఇరాన్ ఆధ్వర్యంలో నిర్వహింపబడుతున్న 6 పరిశ్రమలలో పనిచేసే దాదాపు 2వేల మంది జౌళి కార్మికులు ఆగస్టు 3వ వారం చివరలో సమ్మెలోకి వెళ్ళారు. కంపెనీ ప్రకటించాల్సిన లాభనష్టాల నివేదికను వాయిదా వేయటంద్వారా జూన్‌నుండి అమలుచేయాల్సిన తమ వేతనాల పెంపును సెప్టెంబరుకు వాయిదా వేయటాన్ని కార్మికులు ఈ సందర్భంగా నిరసించారు.

## పెరు

పెరూలోని ఐకా ప్రాంతం-షాంగాంగ్ వద్దనున్న హెర్రో పెరు ఇనుపఖనిజ గనికార్మికులు విధులు బహిష్కరించి ఆగస్టు 18న ఆందోళనకు పూనుకున్నారు. వీరు ప్రధానంగా తమ వేతనాల పెంపును డిమాండ్‌చేశారు. ఆగస్టు 27న కొలాది మంది కార్మికులు 'ప్యాలస్ ఆఫ్ జస్టిస్' వద్దకు ప్రదర్శన నిర్వహించి తమ డిమాండ్‌ను ఎలుగెత్తి చాటారు. ఈ కార్మికులు తమ సమ్మెను 3 వారాలపాటు కొనసాగించారు.

హువాంకాయో దగ్గరలోని ఆర్టిస్టియా దేవాస్ గని కార్మికులు 1200 మంది సెప్టెంబర్ 2 నుండి వారం రోజులపాటు తమ వేతనాల పెంపు డిమాండ్‌పై నిరవధిక ఆందోళన కొనసాగించారు.

## బల్గేరియా

బల్గేరియాలోని చెర్నోమోర్ గనుల కార్మికులు సెప్టెంబర్ 2వ వారంనుండి ప్రారంభించి 3 రోజుల హెచ్చరిక సమ్మెను చేశారు. జూన్ నుండి తమకు చెల్లించాల్సిన వేతన బకాయిలను చెల్లించకుంటే, పెరుగుతున్న ధరలకనుగుణంగా వేతనాలను పెంచకుంటే ఆందోళనను తీవ్రతరం చేస్తామని వారు హెచ్చరించారు. ✸

# చరిత్రను మధిస్తున్న కార్మికుడు

– బెర్టోల్డ్ బ్రెక్ట్

థేబ్స్[1] నగర సప్తద్వార నిర్మాతలెవరు?
గ్రంథాలన్నింటిలో రాజుల పేర్లే కిక్కిరిసి వున్నాయి
బరువైన నల్లరాతి బండలను
కొండలపై నుండి మోసుకొచ్చింది ఈ రాజులేనా?!

పలుమార్లు ధ్వంసమైన బాబిలోన్ పురాన్ని
ప్రతిసారీ పునర్నిర్మించినవారెవరు?
బంగరు శోభతో నగరం మురిసే
'లిమా'[2] నివాసగృహాలలో వాటి నిర్మాతలే నివశిస్తున్నారా?

మహత్తర చైనా గోడ కట్టబడి ముగిసిన ఆ సంధ్యావేళ
అది కట్టిన తాపీ మేస్త్రీలు పయనమై వెళ్ళినదెక్కడికో?!
ప్రఖ్యాత రోమను సామ్రాజ్యపు విశిష్ట విజయ కమాన్ల నిర్మాతలెవరు?
అప్రతిహత విజయాలను సీజర్‌కు సుసాధ్యం చేసిందెవరు?
పాటలలో బైజాంటియమ్[3] నిలిచివుంది సజీవంగా....
ఆమె ఆవాసాలన్నీ రాజప్రాసాదాలేనా!
ఇతిహాసాల్లోని అట్లాంటిస్‌లో
రాత్రివేళల్లో సముద్రజల ఖడ్గాలకు తునకలవుతూ కూడా
తోటి బానిసల కోసం గుండెలు బాదుకున్నవారెవరు?

భరతఖండాన్ని జయించిన యువ అలగ్జాండర్
ఒంటరిగానే సాధించాడా ఈ ఘనకార్యం?!
భీకర సముద్రజలాలలో ప్రచండ తుఫానులకు ఎదురునిలిచిన సీజర్
సేనావాహినిలో వంటవాడు లేకుంటే ఇది సాధ్యమా?!

సముద్ర యుద్ధాల్లో తన సైన్యం సమస్తం
జలసమాధి చేయబడిందప్పుడు
విలపించాడు స్పెయిన్ రాజు.... ఫిలిప్... నిజమే!
అదే క్షణాన, కడుపుకోతకు గురైన మరెవరి కన్నీళ్ళ గురించీ మాట్లాడరేం?

సప్తవర్ష యుద్ధ విజయంతో
ప్రఖ్యాతుడైన ఫ్రెడరిక్‌కు
కీర్తి కిరీటాల్ని సమకూర్చిపెట్టిందెవరు?

ప్రతి పేజీలో ఓ విజయం.....
ఎవరి బలిదానాలు, రక్తమాంసాలతో ఇది సాకారం?!

ప్రతి దశాబ్దానికో యుగపురుషుడు....
అందుకు మూల్యం చెల్లించినవారెందరు?

ఎన్నో ఘటనలు.... మరెన్నో ప్రశ్నలు.....

ఆంగ్లం నుండి అనువాదం : రవి

వివరణలు :
1. ప్రాచీన ఈజిప్టులోని నగరం 2. పెరూ దేశ రాజధాని 3. ప్రాచీన గ్రీకు నగరం ✸

**'పీడితవర్గ ప్రజాఉద్యమాలను...(** **చివరిపేజీ నుండి)**

నిర్మాణక్రమంలో అమరులైనవారందరికీ నివాళు లర్పించారు.

సోషలిస్టు రష్యాను నాశనం చేసేందుకు ప్రపంచ పెట్టుబడిదారులంతా ఏకమై పూనుకున్నప్పుడు కా॥ స్టాలిన్ నాయకత్వంలో రష్యా ప్రజలు, సైన్యం నిలిచి కోట్లమంది బలిదానం చేసి ఫాశిజాన్ని తరిమికొట్టారని కా॥ ఝాన్సి గుర్తుచేశారు. కాగా, కామ్రేడ్ స్టాలిన్‌పై ఆనాటి నుండీ ఈనాటి వరకూ దోపిడీశక్తులు విషం క్రక్కుతూ వున్నాయని పేర్కొన్నారు.

తెలంగాణాలో దొడ్డి కొమరయ్య అమరత్వంలో పోరాటం సాయుధ రూపమందుకొని గ్రామ రాజ్యాల నేర్పరచుకొని పదిలక్షల ఎకరాలను ప్రజలు పంపిణీ చేసుకున్నారని ఈ క్రమంలో నాలుగువేలమంది ప్రాణాలర్పించిన విషయాన్ని ప్రత్యేకించి పేర్కొన్నారు. శ్రీకాకుళ గిరిజనులను సంఘటితపరచి ఉద్యమానికి నాయకత్వం వహించిన ఆదిభట్ల కైలాసం, వెంపటాపు సత్యం తదితరుల త్యాగపూరిత జీవిత విశేషాలను ఆమె వివరించారు. గిరిజనోద్యమంపై తీవ్ర నిర్బంధం విధించిన కాలంలోనే కామ్రేడ్స్ నాగిరెడ్డి, శ్రీశ్రీలతో కలసివెళ్ళి ప్రజలకు ధైర్యం చెప్పారని, నిర్బంధానికి వ్యతిరేకంగా సంఘీభావాన్ని కూడగట్టారని పేర్కొన్నారు. కోరన్న – మంగన్నల వర్ధంతిని ఈనాటికీ గిరిజన ప్రజానీకం స్ఫూర్తిదాయకంగా జరుపుకొంటుండగా, పాలకులు మాత్రం హడలి ఛస్తున్నారని ఆమె పేర్కొన్నారు. కొండమొదలు ప్రాంతంలో అడవిపై, భూమిపై హక్కు కోసం ఉద్యమించిన కుంజం రాజులన్న, మడెం లక్ష్మన్నలను కాల్చి చంపారని, మనుగోపాల ఉద్యమంలో కా॥ కారం పార్వతిని, దుగ్గేరు ఉద్యమంలో కా॥ జన్ను తిరుపతిని భూస్వామ్య గూండాలు బలిగొన్నారని పేర్కొంటూ ఎన్నో నిర్బంధాలు, వత్తిడులు, ఆటుపోట్లు, విచ్ఛిన్నాల నుండే ఉద్యమాన్ని ముందుకు సాగించుకుంటూవస్తూ ఈ క్రమంలోనే విప్లవకారుల ఐక్యతకోసం కృషిసల్పు తున్నామని ఆమె వివరించారు.అయితే విప్లవోద్యమంలో బలహీనపడినవారే పాలక వర్గాలతో గొంతు కలిపి విప్లవకారులపై దాడిచేయటం పట్ల ఆమె ఆవేదన వ్యక్తంచేస్తూ, దానిని సంఘటితంగా త్రిప్పికొట్టాలన్నారు. కేంద్రంలోనూ, రెండు తెలుగు రాష్ట్రాలలోనూ నూతనంగా అధికారంలోకి వచ్చిన బిజెపి, టిఆర్ఎస్, టిడిపి ప్రభుత్వాలన్నీ భూస్వామ్య, సామ్రాజ్యవాద ప్రయోజనాలకు కట్టుబడినవేనని, వీరి వాగ్దానాలకు, ప్రజాకర్షక ఆడంబర నినాదాలకు భ్రమలకు గురికాకుండా ప్రజలను విప్లవోద్యమంలోకి సమీకరించటంలో అందరం నిమగ్నం కావాలని కా॥ ఝాన్సి పిలుపు నిచ్చారు. అరుణోదయ కళాకారులు అమరవీరులపై పాడిన పాటలు సభికులలో స్ఫూర్తిని నింపాయి.

### ములుగు, 12-11-14 :

వరంగల్ జిల్లా ములుగులో కా॥ చంద్ర పుల్లారెడ్డి వర్ధంతి సందర్భంగా బహిరంగసభకు పోలీసులు అనుమతి నిరాకరించటంతో, ములుగు పార్టీ కార్యాలయంలోనే కా॥ స్వామి అధ్యక్షతన సభ జరిగింది. కా॥ సి.పి., కా॥ రామనర్సయ్య, కా॥ అంతిరెడ్డి, కా॥ భూపతి, కొండన్న, మరియు ఖమ్మం, వరంగల్, గోదావరి ప్రాంత విప్లవోద్యమంలో అశు వులుబాసిన కామ్రేడ్స్ అందరకు తొలుత జోహార్ల ర్పించారు. ఈ సభలో సిపిఐ(ఎం-ఎల్) కేంద్ర, రాష్ట్ర నాయకులు కామ్రేడ్ గుర్రం విజయకుమార్, భూతం వీరయ్య, కె. కోటయ్య తదితరులు మాట్లాడి అమరుల ఆశయ సాధనకు పునరంకితమౌతామని ప్రతిన బూనారు.

### వెలుగోడు, 9-11-14 :

భారత విప్లవోద్యమనేత కామ్రేడ్ చంద్ర పుల్లారెడ్డి జన్మస్థలమైన కర్నూలు జిల్లా వెలుగోడు గ్రామంలో 9-11-14న ఆయన 30వ వర్ధంతి సభ సిపిఐ(ఎం-ఎల్) జిల్లా కమిటి ఆధ్వర్యంలో నిర్వహించారు.

తొలుత, వెలుగోడు గ్రామంలో ఇటీవలే నిర్మించిన కామ్రేడ్ చంద్ర పుల్లారెడ్డి స్థూపం వద్ద ఎర్రజెండాల రెపరెపలు, అమరవీరులకు జోహార్లు, ఉద్యమ నినాదాల నడుమ పుష్పగుచ్ఛాలుంచి పార్టీ కామ్రేడ్స్, నాయకులు, ప్రజలు ఘనంగా నివాళు లర్పించారు.

అనంతరం కామ్రేడ్స్ సి.పి., ఎం.ఎస్‌ల మెమోరియల్ హాల్‌లో జరిగిన వర్ధంతి సభకు సిపిఐ(ఎం-ఎల్) నాయకులు కామ్రేడ్ మండ్ల రామసుబ్బారెడ్డి అధ్యక్షతవహించి, కామ్రేడ్ సిపి త్యాగపూరిత జీవిత విశేషాలను ముఖ్యంగా కర్నూలు జిల్లాలో ఆయన నిర్వహించిన పోరాటాన్ని గుర్తుచేశారు.

ఏఐఎఫ్‌టియు(న్యూ) ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షులు కామ్రేడ్ సి. పెద్దన్న మాట్లాడుతూ కామ్రేడ్స్ సి.పి., టి.ఎన్, డి.విల ఆధ్వర్యంలో రివిజనిజం, నయా రివిజనిజాలకు వ్యతిరేకంగా సాగిన పోరాటాన్ని వివరించారు. ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతర పోరాటాలే శరణ్యమని పేర్కొంటూ, తెలుగు గంగ మునక భూములకు పరిహారాన్ని నిరంతర ఆందోళ నోద్యమాల ద్వారానే సాధించుకున్న విషయాన్ని, తెలుగు గంగ కార్మికుల ఉద్యోగ స్థిరీకరణకై దశలవారీగా పోరాటాలు సాగిస్తున్నామనే విషయాన్ని గుర్తుచేశారు. సంక్షోభం తీవ్రమౌతూ, ప్రజా జీవితం దుర్భరమౌతున్న నేటి సంక్లిష్ట పరిస్థితుల్లో అమరుల విప్లవ పోరాటస్ఫూర్తి, త్యాగశీలత, అంకితభావాలను పుణికి పుచ్చుకొని ప్రజలను సమీకరించి పోరాటాలు సాగించాలని ఆయన పిలుపునిచ్చారు.

ఓపిడిఆర్ కర్నూలుజిల్లా అధ్యక్షుడు కామ్రేడ్ ఖాజామొహిద్దీన్ మాట్లాడుతూ కామ్రేడ్ చంద్రపుల్లారెడ్డి సిద్ధాంత పరిజ్ఞానం, సిద్ధాంతంపట్ల దృఢవిశ్వాసం, పోరాటదీక్షను ముందుకుకొనసాగించటమే అమరులకు అందించే నివాళిగా పేర్కొన్నారు. ఈ సభలో అనంత పురం, ఎమ్మిగనూరు, వెలుగోడు ప్రాంతాల నుండి ప్రజలు హాజరయ్యారు. ప్రజా కళాకారులు అమరుల త్యాగాలపై స్ఫూర్తిదాయకమైన పాటలు పాడారు. ✸

Janasakti (Communist Revolutionaries'Fortnightly) RNI No.8315/63 VJ-077/2013-15

# 'పీడితవర్గ ప్రజా ఉద్యమాలు నిర్మించేందుకు ప్రతినబూనుదాం'

## కా॥ చంద్రపుల్లారెడ్డి 30వ వర్ధంతి సభలో వక్తల ఉద్ఘాటన





వెలుగోడులో కా॥ సి.పి. వర్ధంతిసభకు హాజరైన ప్రజానీకం; కా॥ సి.పి. స్థూపం వద్ద నివాళులర్పిస్తున్న పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజానీకం

**ఖమ్మం, 11-11-14 :**

ఖమ్మం పట్టణంలోని అంబేద్కర్‌భవన్‌లో భారత విప్లవోద్యమనేత కామ్రేడ్ చంద్రపుల్లారెడ్డి 30వ వర్ధంతిసభ సిపిఐ(ఎం-ఎల్) రాష్ట్ర కమిటి ఆధ్వర్యంలో స్ఫూర్తిదాయకంగా జరిగింది. ఈ సభకు **సిపిఐ(ఎం-ఎల్) రాష్ట్ర కమిటి సభ్యులు కా॥ భూతం వీరయ్య** అధ్యక్షత వహించారు. తొలుత కా॥ చంద్ర పుల్లారెడ్డికి, భారత విప్లవోద్యమ అమరులందరికీ జోహార్లర్పిస్తూ సభ రెండు నిమిషాలు మౌనం పాటించింది. అమరుల ఆశయాలను కొనసాగిస్తామంటూ సభికులంతా నినదించారు.

కా॥ భూతం వీరయ్య తన అధ్యక్షోపన్యాసంలో కా॥ చంద్ర పుల్లారెడ్డి జీవిత విశేషాలను, విప్లవోద్యమ కృషిని వివరించారు. రివిజనిజం, నయా రివిజనిజాలకు వ్యతిరేకంగా, అతివాద పెడధోరణులకు వ్యతిరేకంగా కామ్రేడ్ సి.పి. సిద్ధాంత పోరాటం జరిపారని, ఖమ్మం, వరంగల్ జిల్లాలలో, గోదావరి ప్రాంతంలో గిరిజనులను సంఘటితపరిచి, వారి పాక్షిక సమస్యలపై నుండి భూమి సమస్యపై కదిలించారని, భూస్వాముల, ఫారెస్టు భూములను పంపకం చేసుకొని ప్రజలు ఈనాటికీ తమ అనుభవంలో సాగుచేసుకుంటున్నారని వివరించారు. విప్లవకారుల ఐక్యత కోసం కృషిసాగిస్తూ, ఈ క్రమంలో కలకత్తాలో గుండెపోటుతో కా॥ సి.పి. మరణించారని చెపుతూ ఆయన వదలివెళ్ళిన ఆశయ పరిపూర్తికై ప్రతినబూనాలని, అదే కా॥ సిపికి, అమరులందరికీ అర్పించే నివాళిగా కా॥ వీరయ్య పేర్కొన్నారు.

**సిపిఐ(ఎం-ఎల్) కేంద్ర నాయకులు కా॥ గుర్రం విజయకుమార్** మాట్లాడుతూ కామ్రేడ్ చంద్రపుల్లారెడ్డి కార్మిక కర్షకరాజ్యం ద్వారానే ప్రజల సమస్యలు పరిష్కారమౌతాయని, అనేక ఆటుపోట్లను ఎదుర్కొంటూ ప్రజా ఉద్యమాన్ని నిర్మించారని, దున్నేవానికే భూమి నినాదంతో తీవ్ర సంఘర్షణల నడుమ, రాజ్యం ప్రయోగించిన నిర్బంధాన్ని, అణచివేతను ప్రజా చైతన్యంతో తిప్పికొట్టి ఉద్యమాన్ని ముందుకు పురోగమింపజేశారన్నారు. జైళ్ళలో కూడా సిద్ధాంత, రాజకీయ అధ్యయనం సాగించి, రచనలు చేశారని వివరిస్తూ కామ్రేడ్ చంద్ర పుల్లారెడ్డికి నివాళులర్పించారు.

1948-51 కాలంలో బిటిరణదివే అనుసరించిన అతివాద విధానం నష్టం కలిగించిందన్నారు. 'వర్గ శత్రువు ఖతం' విధానాన్ని కామ్రేడ్స్ టి.ఎన్, డి.వి, సి.పి వ్యతిరేకిస్తూ వచ్చారని, ప్రజాయుద్ధ పంథాలో విప్లవోద్యమం ముందుకు సాగాలని, వ్యూహాత్మక ప్రాంతాల్లో విప్లవోద్యమ నిర్మాణానికి పూనుకున్నారని వివరించారు.

'ఎమర్జన్సీ' సమయంలో విప్లవకారులపై తీవ్ర నిర్బంధం ప్రయోగించబడుతున్న కాలంలో, విప్లవకారుల ఐక్యత కోసం కృషిసాగించే క్రమంలో కా॥ సి.పి. అమరులయ్యారని, ప్రజా ప్రతిఘటన వర్గ ఉద్యమాలను నిర్మించి ముందుకు సాగటమే అమరులైన కామ్రేడ్స్ సి.పి, టి.ఎన్, డి.వి, కె.వి, రాంనర్సయ్య, అంతిరెడ్డి, కానూసన్యాల్ తదితర నాయకులందరికీ మనం అర్పించే నివాళిగా కా॥ జి. విజయకుమార్ పేర్కొన్నారు.

**రైతుకూలీసంఘం (ఆంధ్రప్రదేశ్) రాష్ట్ర కార్యదర్శి కా॥ కె. కోటయ్య** మాట్లాడుతూ దేశంలో మతతత్వ ప్రమాదం ముందుకొస్తున్నదన్నారు. గుజరాతులో వేలాదిమంది ముస్లిములపై దాడులకు నేతృత్వం వహించిన మోడి, సంఘ్‌పరివార్‌శక్తులు దేశంలో మతతత్వ ఘర్షణలను పెంచుతున్నారన్నారు.

బంగారు తెలంగాణాను నిర్మిస్తానంటూ అధికారంలోకి వచ్చిన టిఆర్ఎస్ అధినేత కె.సి.ఆర్ నక్సలైట్ల ఎజెండానే తన ఎజెండా అంటూనే ప్రజా వ్యతిరేక చర్యలను వేగంగా ముందుకు తెస్తున్నాడని వివరించారు. గ్రామీణ, ఆదివాసీ ప్రాంతాల్లో రైతు కూలీలను ఆదివాసులను నిర్మాణయుతంగా సంఘటితం చేయాలని, రాజకీయ చైతన్యాన్ని పెంపొందించాలని, నిలకడైన ఉద్యమ నిర్మాణ కృషిని ముందుకు సాగించాలని పిలుపునిచ్చారు. నక్సల్బరీ, శ్రీకాకుళం, గోదావరిలోయ, సిరిసిల్ల, జగిత్యాల, కొండమొదలు, దుగ్గేరు అమరులందరికీ కా॥ కోటయ్య జోహార్లర్పించారు.

**సిపిఐ(ఎం-ఎల్) రాష్ట్ర నాయకులు కా॥ భార్గవశ్రీ** మాట్లాడుతూ భారత విప్లవోద్యమ వేగుచుక్క అయిన తెలంగాణా రైతాంగ సాయుధపోరాటం ద్వారా దీర్ఘకాల ప్రజాయుద్ధ పంథాతో 3వేల గ్రామాలను విముక్తం చేసుకొని పదిలక్షల ఎకరాలను ప్రజలు పంపిణీ చేసుకున్నా రన్నారు. అర్ధవలస, అర్ధభూస్వామ్య దేశాలకు మార్గనిర్దేశం చేస్తూ చైనాలో కా॥ మావో నాయకత్వాన విజయవంతమైన నూతన ప్రజాస్వామిక విప్లవం భారతదేశంపై పెను ప్రభావం చూపిందన్నారు. నక్సల్బరీ, శ్రీకాకుళ పోరాటాలు అతివాదం పైచేయి కావడం కారణంగా ముందుకు పురోగమించలేకపోయాయన్నారు. అతివాదం, మితవాదం, అవకాశవాదాలకు వ్యతిరేకంగా పోరాడుతున్న క్రమంలోనే ఐక్యతను సాధించి ముందుకు సాగుతున్నామని వివరిస్తూ, అమరులు కలలుగన్న ఆశయపూర్తికి ప్రతినబూనాలని కా॥ భార్గవశ్రీ పేర్కొన్నారు.

**ఏఐకెఎమ్‌కెఎస్ కో-కన్వీనర్ కామ్రేడ్ సింహాద్రి ఝాన్సి** మాట్లాడతుతూ కామ్రేడ్ సి.పి. కర్నూలు జిల్లాలో పుట్టి, గోదావరిలోయ ప్రాంతంలో ఉద్యమాన్ని నిర్మించి, విప్లవకారుల ఐక్యతా కృషిలో నిమగ్నమై ఉండగా కలకత్తాలో మరణించారని పేర్కొంటూ కామ్రేడ్ సిపికి జోహార్లర్పించారు. కామ్రేడ్స్ రామనర్సయ్య, రామచంద్రయ్యలు పోలీసుల చిత్రహింసలకు గురై ప్రజా ఉద్యమాలలో ప్రాణాలర్పించారని, కామ్రేడ్ తరిమెల నాగిరెడ్డి ఎమర్జన్సీ కాలంలో అజ్ఞాతవాసంలో వుంటూ మారుపేరుతో ఉస్మానియా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరణించారని పేర్కొంటూ, విప్లవోద్యమ

**(తరువాయి 7వ పేజీలో)**

# ఆక్రమణల పేరిట చిరువ్యాపారుల దుకాణాల తొలగింపు - ప్రజా ఆందోళన



వెంకటగిరిలో ధర్నా చేస్తున్న రోడ్డు మార్జిన్ వ్యాపారులు

**వెంకటగిరి, నవంబర్ 2014 :**

నెల్లూరుజిల్లా వెంకటగిరి పట్టణంలో అక్టోబర్ 25 నుండి 30 వరకు మురుగుకాల్వలను శుభ్రపరిచేందుకు వీలుగా ఆక్రమణలను తొలగిస్తున్నామని ప్రకటించిన ప్రభుత్వాధికార్లు రోడ్డు మార్జిన్‌లో వ్యాపారాలు చేసుకొంటున్న చిరు వ్యాపారుల పొట్టగొట్టారు. ట్రాఫిక్‌కు అంతరాయం లేనప్పటికీ, గతంలో పట్టాలు మంజూరు చేసివున్నప్పటికీ చిన్న వ్యాపారుల షాపులను నిర్దాక్షిణ్యంగా కూలదోశారు. వెంకటగిరి పంచాయితీగా వున్నపుడే లే అవుట్, ప్లాన్ అప్రూవల్ పొంది, రోడ్ మార్జిన్‌కి 50 అడుగుల లోపలికి వున్న షాపులను కూడా ధ్వంసం చేశారు. రోడ్డు మార్జిన్‌లో వుంటేనే బ్రతుకు తెరువు వుండే చెప్పులు కుట్టుకునేవాళ్ళు, టైర్ల పంక్చర్లు వేసేవారు, మెకానిక్‌లు, టీ వ్యాపారుల కడుపు మీద దెబ్బకొట్టారు. మరోవైపు సంపన్నులు, అధికారపార్టీ నేతలు - డబ్బు, రాజకీయ పలుకుబడితో మున్సిపల్ అధికారులను, సర్వేయర్లను ప్రలోభపెట్టి తమ ఆక్రమణలోవున్న వ్యాపార, భవన సముదాయాలను కాపాడుకొన్నారు. అధికారులు అనుసరించిన పద్ధతి, వివక్షతలపై తీవ్రస్థాయిలో విమర్శలు వెల్లువెత్తాయి. తొలగింపు ప్రక్రియ ముగిసిన తర్వాత పరామర్శకు వచ్చిన ఎంఎల్‌ఏని తమకు స్థలాలు కేటాయించాలని, శాశ్వతమైన ప్రత్యామ్నాయ ఏర్పాటు చేయాలని చిన్న వ్యాపారులు, వృత్తిదారులు పట్టుబట్టారు.

ఈ క్రమంలోనే రైతుకూలీసంఘం(ఆం.ప్ర.) నెల్లూరు జిల్లా కమిటీ డిమాండ్లతో కూడిన కరపత్రాన్ని ముద్రించి - పట్టణంలో నష్టపోయిన చిన్న వ్యాపారులందరిని కలిసి ప్రత్యామ్నాయ ప్రతిపాదనలతో ప్రభుత్వ అధికారులను, నేతలను నిలవేసి సాధించుకోవాల్సిన అవసరం ఉందని, అందరూ కలసికట్టుగా నిలబడాలని కోరింది. అందులో భాగంగానే **నవంబర్ 2న** వెంకటగిరి పర్యటనకు వచ్చిన పురపాలక మంత్రి కాన్వాయ్‌ని సంఘం ఆధ్వర్యంలో చిరువ్యాపారులు అడ్డగించారు. అధికారులు తమ షాపులను ధ్వంసం చేసిన వైనాన్ని చూడమని, తమకు తిరిగి షాపులు పెట్టుకునేందుకు అక్కడే స్థలం కేటాయించమని ఆందోళనకు దిగడంతో స్థలం కేటాయింపుకు మంత్రి హామీ ఇచ్చాడు.

**నవంబర్ 3న** చిరు వ్యాపారులంతా కలసి నెల్లూరులోని జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి - కలెక్టర్‌కి వినతిపత్రం అందచేశారు. దుకాణాలు కోల్పోయిన వారందరికీ స్థలాలు కేటాయించాలని, కూరగాయల వ్యాపారులకు శాశ్వతంగా మార్కెట్‌ను ఏర్పరచాలని కలెక్టరును కోరగా ఆర్‌డిఓచే విచారణ జరిపించి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రై.కూ.సం(ఆం.ప్ర) రాష్ట్ర సహాయ కార్యదర్శి కా॥ జె. కిషోర్‌బాబు, జిల్లా సహాయకార్యదర్శి కా॥ వి.వి.రమణయ్య, ఎన్.వై.యస్ రాష్ట్ర నాయకులు కా॥ ఎల్. లక్ష్మీరెడ్డి పాల్గొన్నారు. నెల్లూరు పట్టణ రోడ్ మార్జిన్ వ్యాపారుల సంక్షేమ సంఘం (సండే మార్కెట్) నేతలు టి. రమేష్, శరవణ వీరి ఆందోళనకు మద్దతు పలికారు.

దుకాణాలు కోల్పోయిన వారికి తక్షణమే స్థలాలు కేటాయించి పొసెషన్ సర్టిఫికెట్స్ మంజూరు చేయాలని, కలెక్టర్, మంత్రి ఇచ్చిన హామీలను అమలుచేయాలని డిమాండ్ చేస్తూ **నవంబర్ 10న** వెంకటగిరి తహశీల్దార్ కార్యాలయం ఎదుట బాధితులు ధర్నా నిర్వహించారు.

ధర్నానుద్దేశించి కా॥ వి.వి. రమణయ్య మాట్లాడుతూ స్మార్ట్‌సిటీల జపం చేస్తున్న టి.డి.పి. పాలకులు నగరాల నుండి చిన్న పట్టణాల వరకు రోడ్ల విస్తరణ పేరుతో చిరువ్యాపారుల పొట్టలు కొడుతున్నారని, అధికారాన్ని అడ్డం పెట్టుకొని ప్రభుత్వ స్థలాలను ఆక్రమించి పెద్దపెద్ద భవంతులను నిర్మించిన వారిని మాత్రం కాపాడు తున్నారని దుయ్యబట్టారు. చిల్లర వ్యాపారంలోకి ఎఫ్‌డిఐలను అనుమతించిన తర్వాత వాల్‌మార్ట్ మొదలుకొని రిలయన్స్, మోర్ వంటి కార్పొరేట్ కంపెనీల షాపింగ్‌మాల్స్‌లను చిన్న చిన్న పట్టణాల్లో ఏర్పాటు చేయడానికి వీలుగా చిరువ్యాపారులను చిదిమేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్ల కంపెనీలకు, ఆటోమొబైల్ కంపెనీలకు లాభాలు సమకూర్చేందుకు వీలుగా రోడ్ల విస్తరణ కార్యక్రమాన్ని పాలకులు చేపట్టారని, అభివృద్ధి అంటే ప్రజల జీవితాలను కాలరాసేదిగా వుండకూడదని అన్నారు. వెంకగిరి రోడ్ మార్జిన్ వ్యాపారులకు ఇప్పుడున్నచోటే ఒక్కొక్కరికి 72 చదరపు అడుగుల స్థలం కేటాయించి పొసెషన్ సర్టిఫికేట్స్ మంజూరుచేస్తే తిరిగి వ్యాపారం ప్రారంభించేందుకు వీలవుతుందని తక్షణమే అధికార యంత్రాంగం జోక్యం చేసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం గూడూరు డివిజన్ ఆర్‌డిఓను కలిసి వినతి పత్రం ఇచ్చారు.

ఈ మొత్తం కార్యక్రమంలో జ్యోతిమహల్ సెంటర్ రోడ్ మార్జిన్ వ్యాపారులు పి. బుజ్జయ్య, సుబ్రమణ్యం, షేక్ అలీ, ఓ. శ్రీనివాసులు, దారా రోశయ్య తదితరులు పాల్గొన్నారు. ✡

# సాగునీటి లిఫ్ట్ ఏర్పాటుకై రైతుల ధర్నా

**నడిగూడెం, 29-9-14 :**

నల్గొండజిల్లా, నడిగూడెం మండలంలోని రామాపురం, ఎకెపేట తండా, తెల్లబెల్లి, కోదండరామాపురం గ్రామాల పరిధిలోని యస్‌సి, యస్‌టి, బిసి రైతులకు రామాపురం శివారులోని సర్వే నెంబరు 190లో 2500 ఎకరాల అసైన్‌మెంట్ పట్టాభూములున్నాయి. ఈ భూములకు సాగునీరందించే ఎత్తిపోతల పథకాన్ని మంజూరు చేయాలని డిమాండ్‌చేస్తూ తెలంగాణా రైతుకూలీసంఘం ఆధ్వర్యంలో రైతులు స్థానిక తహసీల్దారు కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. తెలంగాణా రైతుకూలీసంఘం రాష్ట్ర నాయకులు కా॥ ఉప్పలయ్య, జిల్లా నాయకులు కామ్రేడ్ వేలాద్రి జక్కుల నర్సింహ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొని నాయకత్వం వహించారు. నీటి సౌకర్యం లేక 2,500 ఎకరాల భూములు బీళ్ళుగా మారుతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ధర్నా అనంతరం తమ డిమాండ్లతోకూడిన వినతి పత్రాన్ని తాశీల్దారుకు అందచేశారు. ✡

Printed, Published and Owned by P.Jaswantha Rao 32-13-26/1, B.M.Rao Road, Moghalrajapuram, Vijayawada-520 010
and Printed at Chaitanya Printers, Gora Veedhi, Suryaraopet Vijayawada-2
Editor: P. Jaswantha Rao, 32-13-26/1, B.M.Rao Road, Moghalrajapuram, Vijayawada-520 010